
చేనేతల ఆశాకిరణం టెక్స్‌టైల్ పార్కు



బనవాసి వద్ద ఏర్పాటుచేసే టెక్స్‌టైల్ పార్క్ పాతికేళ్ల స్వప్నం. 2001-02లో నాటి పురపాలక శాఖ మంత్రి ఎమ్మెల్యే బీవీ మోహన్‌రెడ్డి 'బనవాసి జెర్సీ పశుక్షేత్రం'లో టెక్స్‌టెల్స్ పార్క్(అప్పెరల్ పార్క్) ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. చంద్రబాబును ఒప్పించి 2004లో శంకుస్థాపన చేశారు. తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించింది. పదేళ్ల తరువాత 2015లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తండ్రి బీవీ మోహన్‌రెడ్డి కల సాకారం కోసం సీఎం చంద్రబాబును ఒప్పించి వంద ఎకరాలు కేటాయించి, రూ.వంద కోట్లతో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు తయారు చేశారు. పనులు మొదలయ్యే సమయంలో.. వైసీపీ ప్రభుత్వం వచ్చాక భూములు రద్దు చేసి అటకెక్కించింది. ఆ పార్క్ రద్దు చేసిన రెండుసార్లు కూడా అప్పటి ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి నిర్లక్ష్యమే కారణమని తెలుస్తుంది. ఎన్నికలకు ముందు స్పష్టమైన హామీ ఇచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు, యువగళం పాదయాత్రలో యువనేత నారా లోకేశ్‌పై ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఒత్తిడి తీసుకొచ్చి దివంగత తండ్రి బీవీ మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసిన ప్రదేశంలోనే 77.35 ఎకరాలు టెక్స్‌టైల్ పార్క్ కోసం ఏపీఐఐసీకి కేటాయించారు. నేడు సీఎం చంద్రబాబు వర్చువల్ ద్వారా భూమి పూజ చేయబోతున్నారు. ఇందు కోసం జౌళి, చేనేత శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



- ఎమ్మిగనూరులో ఉపాధి లక్ష్యంగా టెక్స్‌టైల్ పార్క్‌కు రూపకల్పన
- 2003లో బీవీ మోహన్‌రెడ్డి మంత్రి హోదాలో శంకుస్థాపన
- 2014లో వంద ఎకరాల కేటాయింపు
- రూ.వంద కోట్లతో మౌలిక వసతులకు ప్రతిపాదనలు
- వైసీపీ ప్రభుత్వ హయాంలో రద్దు
- ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి చొరవతో భూ కేటాయింపులు
- నేడు వర్చువల్‌గా సీఎం చంద్రబాబు నాయుడు శంకుస్థాపన

కర్నూలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు చేనేతల పురిటిగడ్డ. మగ్గాలపై నేతన్నలు తయారు చేసిన నూలు (కాటన్) వస్త్రాలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందాయి. దివంగత పద్మశ్రీ మాచాని సోమప్ప దూరదృష్టితో 'ఎమ్మిగనూరు చేనేతల సహకార సొసైటీ' స్థాపించి చేనేత కార్మికులకు ఉపాధి చూపించారు. ఎమ్మిగనూరు పట్టణం సహా నందవరం, నాగులదిన్నె, గోనేగండ్ల, గుడేకల్లు, ఆదోని, కోసిగి ప్రాంతాల్లో దాదాపు 25 వేలకు పైగా చేనేత కుటుంబాలు నేతమగ్గాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. సహకార, సహకారేతర రంగాల్లో చేనేత వస్త్ర ఉత్పత్తితో బతుకుబండి లాగిస్తున్నారు. కాలక్రమేణ చేనేత మగ్గాల స్థానంలో మరమగ్గాలు వచ్చాయి. వాటి పోటీ తట్టుకోలేక చేనేత మగ్గాలు చితికిల పడ్డాయి. అదే సమయంలో వేలాది మందికి ఉపాధి చూపిన ఎమ్మిగనూరు స్పిన్నింగ్ (నూలు) మిల్లు మూతపడింది. అర్థాకలితో అలమటిస్తున్న చేనేత కార్మికులకు ఉపాధి చూపించాలనే లక్ష్యంగా 2001-02లో అప్పటి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి బనవాసి జెర్సీ పశుక్షేత్రంలో 'టెక్స్‌టైల్ (అప్పెరల్) పార్క్' ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. అప్పటి సీఎం చంద్రబాబును ఒప్పించారు. 2004 ఎన్నికలకు ఆరు నెలల ముందు ఈ పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించింది. తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టిన ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో చేనేత కార్మికుల టెక్స్‌టైల్ పార్క్ ఆశలు ఎండమావిగా మారాయి.



ఎమ్మిగనూరు టెక్స్‌టైల్ పార్కుకు 2003లో నాటి మంత్రి బీవీ మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకం (ఫైల్)

నేడు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

ఎమ్మిగనూరు తేరు బజారులో ఎన్నికల ముందు జరిగిన బాదుడే బాదుడు సభలో ప్రతిపక్ష నేతగా టీడీపీ అధినేత చంద్రబాబు, యువగళం పాదయాత్రలో భాగంగా వీవర్స్ కాలనీ మైదానంలో జరిగిన సభలో యువనేత నారా లోకేశ్ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుపై స్పష్టమైన హామీ ఇచ్చారు. టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సీఎం చంద్రబాబు, విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఒప్పించి బనవాసి జెర్సీ పశుక్షేత్రంలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు కోసం ఏపీఐఐసీకి 77.35 ఎకరాలు కేటాయించారు. సీఎం చంద్రబాబు టెక్స్‌టైల్ పార్కుతో పాటు 14 ఎఫ్ఎఫ్‌టీసీలు, 25 ఎంఎస్ఎంఈ పార్కులకు గురువారం శంకుస్థాపన చేయనున్నారు. అందులో భాగంగానే ఎమ్మిగనూరు టెక్స్‌టైల్ పార్క్‌కు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. ఎమ్మెల్యే బీవీ రెవెన్యూ, జౌళి, చేనేత విభాగం అధికారులతో కలసి భూమి పరిశీలించారు. మౌలిక వసతులు కల్పనకు త్వరలోనే డీపీఆర్ తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామని జౌళి, చేనేత శాఖ ఏడీ నాగరాజురావు ఆంధ్రజ్యోతికి వివరించారు. ఈ పార్క్ ఏర్పాటు ద్వారా నూలు మిల్లు, గార్మెంట్స్ యూనిట్లు వచ్చే అవకాశం ఉంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఏడీ తెలిపారు. అలాగే 20 ఎకరాల్లో ఫ్రేమ్ మగ్గాలు ఏర్పాటు చేసి చేనేతలకు ఉపాధి కల్పించేందుకు ఎమ్మెల్యే బీవీ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

పదేళ్ల తరువాత వంద ఎకరాలు

పదేళ్ల తరువాత 2014 ఎన్నికల్లో దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి తనయుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా గెలిచారు. తండ్రి కల సాకారం కోసం అప్పటి సీఎం చంద్రబాబును ఒప్పించి 2015లో పశుసంవర్ధక శాఖ పరిధిలోని బనవాసి జెర్సీ పశుక్షేత్రానికి చెందిన వంద ఎకరాలు టెక్స్‌టైల్ పార్క్ కోసం కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మౌలిక వసతుల కోసం రూ.98 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తమిళనాడు, గుజరాత్, మహరాష్ట్ర వంటి రాష్ట్రాల్లో పర్యటించి పలు గార్మెంట్ తయారి పరిశ్రమలు ఇక్కడకు ఏర్పాటు చేసేందుకు ఒప్పించారు. అయితే 2019లో కొలువుదీరిన వైసీపీ ప్రభుత్వం ఆ పార్క్‌కు కేటాయించిన భూములు రద్దు చేసింది. అప్పుడు కూడా ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా ఎర్రకోట చెన్నకేశవరెడ్డినే ఉన్నారు. టీడీపీ ప్రభుత్వం రెండు పర్యాయాలు టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే.. 2004లో కాంగ్రెస్, 2019లో వైసీపీ ఎమ్మెల్యేగా గెలిచిన ఎర్రకోట రాజకీయ దురుద్దేశంతోనే టెక్స్‌టైల్ పార్క్ రద్దు చేయించారని ఆరోపణలు ఉన్నాయి.



టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్, చేనేత, జౌళి శాఖ ఏడీ తదితరులు

ప్రశాంతంగా పాలీసెట్

- జిల్లాలో 87.45 శాతం హాజరు నమోదు



సెయింట్ జోసెఫ్ పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ బి. నాగేశ్వరరావు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశాల కోసం నిర్వహించే పాలీసెట్ పరీక్ష బుధవారం ప్రశాంతంగా ముగిసింది. కర్నూలు జిల్లాలో మొత్తం 7,366 మంది విద్యార్థులకుగాను 6,442 మంది హాజరు కాగా 87.45 శాతం హాజరు నమోదైంది. కర్నూలు నగరంలో 12 పరీక్షా కేంద్రాల్లో 4,595 మందికి గాను 4,003 మంది హాజరు కాగా ఆదోనిలోని పది పరీక్ష కేంద్రాల్లో 2771 మందికి గాను 2439 మంది విద్యార్థులు హాజరై 88.02 శాతం హాజరు నమోదైంది. ఏపీ అమరావతి స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ బి. నాగేశ్వరరావు, కర్నూలులోని సెయింట్ జోసెఫ్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అలాగే ఈ పరీక్ష కేంద్రాలను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలీసెట్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీధర్, జీవీ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పదో తరగతి పాసైన, ఫెయిలైన విద్యార్థులు ఐటీఐలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కృష్ణవేణి ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ దామోదర్ చౌదరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి మే 24వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్: 88869 97744ను సంప్రదించాలని ఆయన కోరారు.

నీట్ యూజీ-2025 పరీక్షకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మే 4వ తేదీన నీట్ యూజీ-2025 పరీక్ష సందర్భంగా కలెక్టరేట్‌లో ల్యాండ్‌లైన్ నెంబరు 08518-277305తో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రంజిత్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 3వ తేదీ, 4వ తేదీ రెండు రోజులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈహెల్ప్ డెస్క్ పనిచేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఏమైనా సందేహాలు, ఇతరత్రా ఏదైనా సమాచారం కోసం హెల్ప్ డెస్క్‌కు ఫోన్ చేయవచ్చని సూచించారు.

ఏసీబీ డీఎస్పీగా సోమన్న బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ఏసీబీ డీఎస్పీ దివిటి సోమన్న

కర్నూలు క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల కర్నూలు రేంజ్‌లో ఏసీబీ డీఎస్పీగా దివిటి సోమన్న బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయనది అనంతపురం జిల్లా, కనగానపల్లి మండలం వేపకుంట గ్రామం. 1991లో ఎస్ఐ హోదాలో పోలీసు శాఖలో సోమన్న విధుల్లో చేరారు. ఎస్ఐగా క్రిష్ణగిరి, సంజామల, నందవరం, వెల్దుర్తి, పీటీసీ అనంతపురంలో ప్రమోషన్ పొందిన తర్వాత సీఐగా సీఐడీలో, ప్యాపిలి, ఆదోని తాలుకా, లక్కిరెడ్డిపల్లెలో పనిచేశారు. 2020లో డీఎస్పీగా పదోన్నతి పొంది సీఐడీ శాఖలో, ఆదోని సబ్ డివిజన్‌లో పనిచేశారు.

కార్మిక పోరాట దినం

- కనుమరుగవుతున్న 8 గంటల పని విధానం
- నేడు మే డే

కర్నూలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చికాగో కార్మికులు తమ రక్తతర్పణతో 8 గంటల పని విధానం సాధించి నేటికి 139 ఏళ్లు. 1886 మే 1న 8 గంటల రిక్రియేషన్ విధానం అమలులోకి రావడంతో నాటి నుంచి ఏటా మే ఒకటో తారీఖున 'ప్రపంచ కార్మిక దినోత్సవం' జరుపుకుంటారు. అయితే కాలక్రమేణ ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కార్మిక చట్టాలను కాపాడుకోడానికి పోరాడే దీక్షా దినమే మేడే.

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో లక్షలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. మోటర్, అనుబంధ రంగాల్లో 35 వేల మంది, భవన నిర్మాణ రంగంలో 2.50 లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారు. మరో లక్ష మందికిపైగా అసంఘటిత కార్మికులు ఉన్నారని కార్మిక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వీరికి ప్రభుత్వ పరంగా అందాల్సిన సంక్షేమ పథకాలు ఫలాలు అందడం లేదు. గతంలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ ప్రాంతాల్లో పేపర్ మిల్లు, స్పిన్నింగ్ (నూలు) మిల్లులు, నూనే మిల్లులు, జిన్నింగ్ మిల్లులు, సున్నపు పరిశ్రమ, గ్రానైట్, నాపరాతి పరిశ్రమలు.. ఇలా వివిధ పరిశ్రమల్లో లక్షలాది మంది కార్మికులు పని చేసేవారు. పారిశ్రామిక రంగంలో వచ్చిన మార్పుల వల్ల ఈ పరిశ్రమలు దెబ్బతినిపోయాయి.



- **కనుమరుగు అవుతున్న కార్మిక చట్టాలు:**

దేశవ్యాప్తంగా కార్మికోద్యమాలు బలహీనపడటంతో 8 గంటల పని విధానం స్థానంలో 12 గంటల పని విధానం వచ్చింది.

(మిగతా 6లో..)

అభ్యుదయవాది బసవేశ్వరుడు : కలెక్టర్

- బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి
- పాల్గొన్న వీరశైవ, జంగమ సంఘాల నాయకులు

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో కుల, వర్ణ, లింగ వివక్షతను వ్యతిరేకించి సమ సమాజం కోసం పోరాడిన అభ్యుదయ వాది మహాత్మా బసవేశ్వరుడు అని కలెక్టర్ రంజిత్ బాషా కొనియాడారు. బుధవారం మహాత్మా బసవేశ్వర 892వ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్లో జిల్లా యువజన సంక్షేమశాఖ-సెట్కూరు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బసవేశ్వర చిత్రపటానికి కలెక్టర్, వీరశైవ, జంగమ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 12వ శతాబ్దంలో కర్ణాటకలో జన్మించిన బసవేశ్వరుడికి ఆరోజుల్లోనే మనుషులంతా ఒక్కటే.. అందరూ సమానం అనే ఆలోచనలు ఉండడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్, వీరశైవ ఐక్య సంఘం అధ్యక్షుడు ఏజీ మల్లికార్జునప్ప, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరప్ప, సంఘ సభ్యులు విశ్వేశ్వరయ్య, శివరాజ్, యాగంటయ్య, శెట్టి వీరశేఖరప్ప, యాగంటి ఈశ్వర్, మల్లికార్జునయ్య, వీరశైవ జంగమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



బసవేశ్వరుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, నాయకులు

హిట్ అండ్ రన్ కేసులపై సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో నమోదైన హిట్ అండ్ రన్ కేసులపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి బుధవారం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో 76, నంద్యాల జిల్లాలో 38 హిట్ అండ్ రన్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సరైన నష్టపరిహారం అందించాలన్నారు.

సర్వత్రా ఉత్కంఠ



మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి



మొల్ల జాకీర్ హుస్సేన్, 2వ వార్డు కౌన్సిలర్

- మే 8న మున్సిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం..?
- వీగిపోయేలా పావులు కదుపుతున్న ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి
- అవిశ్వాసం నెగ్గితే ఛైర్మన్ రేసులో జాకీర్ హుస్సేన్

నందికొట్కూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మున్సిపాల్టీలో టీడీపీ లోనే రెండు వర్గాలుగా విడిపోయి అవిశ్వాసానికి తెరలేపారు. ఒకవర్గం బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డిది కాగా మరో వర్గం మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయ సూర్యది. ఎంపీ బైరెడ్డి వర్గానికి చెందిన ప్రస్తుతం దాసి సుధాకర్ రెడ్డి మున్సిపల్ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. జాకీర్ హుస్సేన్ ఛైర్మన్ పదవి ఆశించి భంగపడ్డారు. నామమాత్రంగా ఆయన తమ్ముడు రబ్బానీకి వైస్ ఛైర్మన్ పదవిని అప్పట్లో కట్టబెట్టారు. దీంతో ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి, జాకీర్ హుస్సేన్‌ల మధ్య దూరం పెరిగింది. 2024 ఎన్నికలకు ముందు కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ టీడీపీలో చేరి పార్టీ విజయానికి కృషిచేశారు. ఎమ్మెల్యే వర్గానికి చెందిన జాకీర్ హుస్సేన్ ఛైర్మన్‌పై అవిశ్వాసానికి తెరలేపారు. స్థానిక మున్సిపాల్టీలో ఛైర్మన్ అవిశ్వాసంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. టీడీపీలోనే రెండు వర్గాలుగా విడిపోయి అవిశ్వాసానికి తెరలేపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైసీపీ నుంచి రెండు వర్గాలుగా విడిపోయి టీడీపీలో చేరారు. ఒక వర్గం బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరితే మరో వర్గం మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వర్గంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే వర్గం ఛైర్మన్‌పై అవిశ్వాసానికి తెరలేపారు. ప్రతి నెలా జరగాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఛైర్మన్ నెలమరిచి నెల నిర్వహిస్తూ వచ్చారు. ఈసారి ఏకంగా మూడో నెలల తర్వాత సమావేశం నిర్వహించారు. 2024 ఎన్నికల ముందు టీడీపీలో చేరిన జాకీర్ హుస్సేన్ వర్గం అవిశ్వాసాన్ని నెగ్గించుకునేందుకు వ్యూహాలు రచిస్తుండగా.. ఒక వేళ అవిశ్వాసం పెడితే వీగిపోయేందుకు నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి వర్గంలో ఉన్న ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ప్రతివ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. తానుకూడా టీడీపీలోనే ఉన్నాను కదా ఎలా అవిశ్వాసం పెడతారంటూ ఛైర్మన్ కూడా అధిష్టానం పెద్దల ముందు మొరపెట్టుకున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాసం ఇటు ఎమ్మెల్యే అటు ఎంపీలకు సవాల్‌గా మారిందని టీడీపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మున్సిపల్ వైస్‌ఛైర్మన్ రబ్బాని, ఆయన సోదరుడు కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు నందికొట్కూరు పటేల్ సెంటర్ సాక్షిగా నారా చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీ విజయం కోసం వంతుగా కృషిచేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు మినహా మిగిలిన వారంతా రెండు వర్గాలుగా విడిపోయి బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో కొందరు, మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సమక్షంలో మరికొందరు టీడీపీలో చేరారు. మొదట 16మంది కౌన్సిలర్లతో మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. మున్సిపాల్టీలో 29 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అందులో టీడీపీ నుంచి భాస్కర్‌రెడ్డి ఒక్కరే గెలిచారు. మిగిలిన వారంతా వైసీపీలోనూ, వైసీపీ రెబల్స్‌గా నామినేషన్లు వేసి గెలిచిన వారే. బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో చేరిన వారిలో ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి తీరు నచ్చక నలుగురు కౌన్సిలర్లతో పాటు వైసీపీకి చెందిన కౌన్సిల ర్లు మొత్తం 12మంది కౌన్సిలర్లు మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ప్రస్తుతం ఛైర్మన్‌తో సహా 10మంది కౌన్సిలర్లు ఎంపీ వర్గంలో ఉండగా, 15మంది కౌన్సిలర్లు మాండ్ర వర్గంలో ఉన్నారు.

సుధాకర్‌రెడ్డిని ఛైర్మన్ పదవి నుంచి..

మార్చి 17వ తేదీతో ప్రస్తుతం ఉన్న కౌన్సిల్ బాడీకి నాలుగు సంవత్సరాలు పూర్తి అయ్యింది. నందికొట్కూరు మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డిని ఛైర్మన్ పదవి నుంచి దింపేందుకు ఎమ్మెల్యే వర్గం కంకణ బద్ధులై ఉన్నారు. నెలన్నర రోజులుగా మున్సిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వర్గం కౌన్సిలర్లు అధిష్టానాన్ని ఒప్పించే ప్రయత్నం చేశారు. నెలన్నర అనంతరం అధిష్టానం నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో కలెక్టర్ ఆదేశాలతో అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసులను ఆత్మకూరు ఆర్‌డీవో నాగజ్యోతి కౌన్సిలర్లకు జారీ చేశారు. దీంతో మే 8వ తేదీన ఉదయం 11గంటలకు మున్సిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. ఛైర్మన్ మార్పుపై పట్టణంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది.



చీనీ రైతుల కష్టాలు

- టన్ను రూ.50 వేల నుంచి రూ.15 వేలకు పతనం
- ముందుకు రాని వ్యాపారులు
- దళారుల బెడద అధికం
- తెగుళ్లతో దెబ్బతిన్న తోటలు
- నష్టపోతున్నామంటూ రైతుల ఆవేదన

చాగలమర్రి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చీనీ కాయల ధర రోజురోజుకూ పడిపోతోంది. టన్ను రూ.50 వేల నుంచి రూ.15 వేలకు దిగజారిపోయింది. కోత సమయంలో ధరలు తగ్గిపోవడంతో రైతులు దగాపడుతున్నారు. ప్రతి ఏటా ఇంతే. పంట దిగుబడి లేనప్పుడు ధర బాగా ఉంటుంది. కాయ చేతికొచ్చాక ధర తగ్గిపోతుంది. మార్కెట్ మాయాజాలంతో రైతులు దగా పడుతున్నారు. వ్యాపారులు కొనడానికి ముందుకు రావడం లేదు. వ్యాపారులు చెప్పిన ధరకే విక్రయించుకోవాల్సి వస్తోంది. నంద్యాల జిల్లాలో 1,389 ఎకరాల్లో చీనీ సాగు చేశారు. బనగానపల్లెలో 700 ఎకరాలు, నందికొట్కూరులో 92 ఎకరాలు, డోన్‌లో 104 ఎకరాలు, పాణ్యంలో 20, నంద్యాలలో 22, ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలంలో 84 ఎకరాలు, ఆళ్లగడ్డలో 20, ఉయ్యాలవాడ 65, రుద్రవరం 63 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. శిరివెళ్ల, దొర్నిపాడు, శ్రీశైలం నియోజకవర్గంలో చీనీ సాగు చేయడం లేదు.




కొలుములపేటలో సాగు చేసిన చీనీ తోట

రూ.50 వేల నుంచి రూ.15 వేలకు..



జిల్లాలో చీనీ ధరలు ఉన్నట్లుండి పడిపోయాయి. ప్రస్తుతం టన్ను రూ.15 వేలు పలుకుతోంది. వ్యాపారులు పొలం వద్దకు వచ్చి ఇంత తక్కువ ధర చెప్పడంతో కాయలు అమ్మాలో లేదో తెలియక రైతులు దిగాలు పడుతున్నారు. రెండు నెలల క్రితం వరకు ధరలు రోజు రోజుకూ పెరుగుతూ వచ్చాయి. టన్ను రూ.50 వేలు కూడా పలికాయి. ప్రస్తుతం ధర రూ.15 వేలకు పడిపోయింది. దీనికి కారణం ఇతర రాష్ట్రాల్లో భారీగా అకాల వర్షాలు కురవడమేనని వ్యాపారులు అంటున్నారు. ఢిల్లీ, ముంబై, కలకత్తా తదితర ప్రాంతాల్లో వ్యాపారం మందగించిందని, ఎగుమతులు లేకపోవడంతో ధరలు పడిపోయాయని వ్యాపారులు అంటున్నారు.

టన్ను రూ.25 వేలు ఉంటేనే..



నంద్యాల జిల్లాలో 1,389 ఎకరాల్లో చీనీ సాగు ఉంది. సాగు చేసినప్పటి నుంచి ఐదేళ్ల పాటు ఎలాంటి ఫలసాయం ఉండదు. మూడేళ్ల పాటు అంతర్ పంటలు సాగు చేసుకోవచ్చు. కంటికి రెప్పలా కాపాడుకుంటే ఆ తరువాత దిగుబడి మొదలవుతుంది. ఈ సమయంలో మార్కెట్ హెచ్చుతగ్గుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. చీనీ ధర కనీసం రూ.25 వేలకు పైగా ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుందని అంటున్నారు. ప్రస్తుతం చీనీ చెట్లకు తెగుళ్ల బెడద అధికంగా ఉంది. తెగుళ్ల నివారణకు అధిక మోతాదులో క్రిమిసంహారక మందులు వాడాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. రసాయనిక ఎరువులు, సేంద్రియ ఎరువుల ధరలు బాగా పెరిగాయని, వీటన్నింటిని తట్టుకోవాలంటే చీనీ టన్ను కనీసం రూ.25 వేలు ఉంటేనే గిట్టుబాటు అవుతుందని రైతులు అంటున్నారు. వ్యాపారులు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర నిర్ణయిస్తారు. దళారుల బెడద కూడా అధికంగా ఉంది. ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలి.



తెగుళ్లతో ఎండిన చీనీ చెట్టును చూపిస్తున్న రైతు

● ధరలు లేక తోటల్లోనే కాయలు

ధరలు లేకపోవడంతో రైతులు చీనీ కాయలు అమ్మేందుకు ఇష్టపడటం లేదు. జిల్లాలో చెప్పుకునే స్థాయిలో వర్షాలు కూడా కురవలేదు. ధర ఉంటే త్వరగా చీనీ కాయలు మార్కెట్‌కు తరలిస్తే మరోకాపుకు వాతావరణం అనుకూలంగా ఉంటుందని రైతులు అంటున్నారు. ధరలు లేకపోవడంతో కాయలు అమ్మేందుకు రైతులు సిద్ధపడటం లేదు. తోటల వద్దకు వచ్చే వ్యాపారులేమో మార్కెట్‌లో ఉన్న ధరకంటే తక్కువకు అడుగుతున్నారు. అమ్మకుండా ఉంటే చెట్లకే కాయలు మాగి రాలిపోయే ప్రమాదం ఉంది. కొందరు రైతులు చెట్లకున్న కాయలను గ్రేడింగ్ చేయించి తక్కువ ధరకే విక్రయించుకుంటున్నారు. అయితే ఈ ధరకు పెట్టుబడులు కూడా రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి రాయితీలు కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

దిగుబడి సమయంలో ధర లేదు



మూడు ఎకరాల్లో చీనీ పంట సాగు చేశా. దిగుబడి వచ్చే సమయంలో ధర లేకపోవడంతో వ్యాపారులు అడిగిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. పెట్టుబడి కూడా రావడం లేదు. చీనీకాయల వ్యాపారం సాగేలా ప్రభుత్వం చూడాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, కొలుములపేట గ్రామం

ధరలేక నష్టపోతున్నాం



చీనీ పంట సాగు వల్ల ధర లేక నష్టపోతున్నాం. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎండలకు కాయలు దెబ్బతిని నల్లబారుతున్నాయి. పంట దిగుబడి వచ్చేసరికి ధరలు లేవు. వ్యాపారులు అడిగిన ధరకే అమ్ముతున్నాం. డ్రిప్ సౌకర్యం కల్పించి ప్రభుత్వమే ఆదుకోవాలి.

- నరసింహారెడ్డి, రైతు, కొలుములపేట

రాయితీలు కల్పించాలి



నాలుగు ఎకరాల్లో చీనీ తోట సాగు చేశా. ఐదేళ్ల పాటు పంటను కాపాడుకుంటూ వచ్చా. దిగుబడి వచ్చే సమయానికి ధరలేదు. ధరలు తగ్గడంతో వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. తెగుళ్లతో చెట్లు కూడా దెబ్బతింటున్నాయి. ఎన్ని పురుగు మందులు వాడిన పురుగు చావడం లేదు. దీంతో దిగుబడి కూడా తగ్గుతోంది. తెగుళ్ల నివారణకు సూచనలు, సలహాలు ఇచ్చి ఆదుకోవాలి.

- చిన్న సంజీవరెడ్డి, రైతు, కొలుములపేట

ప్రచారాలకే.. పరిమితం

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పాలం పిలుస్తోంది కార్యక్రమానికి నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. ప్రతి మంగళ, బుధవారం జరిగే ఈ కార్యక్రమం కేవలం ప్రచారానికే పరిమితమైంది. రైతులను అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు ప్రారంభించిన 'పాలం పిలుస్తోంది'కు రైతులు, అనుబంధ శాఖల అధికారులు హాజరు కావడంలేదు. దీంతో మండలాల్లో వ్యవసాయాధికారులు తూతూ మంత్రంగా సమావేశం నిర్వహించి ఫొటోలు దిగి ముగించేస్తున్నారు. ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చినా హాజరు కావడం లేదు. ప్రభుత్వ ఆశయం నెరవేరే విధంగా పాలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మరింత సమర్ధవంతంగా, ఉపయోగకరంగా నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.



గడివేముల మండలంలో ఫొటోలకే పరిమితమైన పాలం పిలుస్తోంది

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులకు పంటల సాగు, సస్యరక్షణ, ఎరువుల వినియోగం అంశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని అమలుచేస్తోంది. ఈ కార్యక్రమం కేవలం ప్రచారార్భాటాలకే పరిమితమైంది. ఖరీఫ్, రబీ సీజన్లలో నంద్యాల జిల్లాలోని 29మండలాల్లో ప్రతి మంగళ, బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమానికి వ్యవసాయ, అను బంధశాఖల అధికారులు, శాస్త్రవేత్తలు తప్పనిసరిగా హాజరుకావాలి. కానీ కేవలం మండల వ్యవసాయాధికారులు మాత్రమే ఇద్దరు, ముగ్గురు రైతులతో ఫొటోలు దిగుతూ తూతూమంత్రంగా ముగిస్తున్నారు.

పత్తాలేని అనుబంధశాఖల అధికారులు

- క్షేత్రస్థాయిలో అమలుకాని 'పొలం పిలుస్తోంది'
- హాజరు కాని రైతులు, అధికారులు
- ఆసక్తి చూపని ప్రజాప్రతినిధులు
- సమావేశాల కోసం నిధులు సైతం మంజూరు

పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ, పశుసంవర్ధక, మార్కెటింగ్, ఆత్మ, ప్రకృతిసేద్యం, డెయిరీ, మత్స్యశాఖ, సూక్ష్మనీటిసాగు విభాగాల అధికారులు, శాస్త్రవేత్తలు హాజరై రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలి. ఉదయం 8.30గంటల నుంచి 10గంటల వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం, అనంతరం 10గంటల నుంచి 12 గంటల దాకా నిపుణులు, శాస్త్రవేత్తలను రప్పించి రైతులతో ముఖాముఖి మాట్లాడించాలి. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎంపిక చేసిన గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలను చూడాలి. ఆ తర్వాత 4గంటల నుంచి 5.30గంటల వరకు సమావేశాన్ని ఏర్పాటుచేసి రైతుల సందేహాలను నివృత్తిచేసి, రైతుల ఆదాయాన్ని గతంలో కంటే గణనీయంగా పెంచాలి. పాడిపరిశ్రమ అధికారులు పశుపోషణపై పాడిరైతులకు అవగాహన కల్పించాలి. అదేవిధంగా భూసార పరీక్షలు నిర్వహించి మట్టినమూనాలు సేకరించడంతో పాటు అందుకు అనుగుణంగా రైతులు వినియోగించాల్సిన ఎరువులపై స్పష్టత ఇవ్వాలి. కానీ మండల వ్యవసాయాధికారి ఎఫ్‌పీవోలు మినహా ఏఒక్క అనుబంధశాఖల అధికారులు హాజరుకాకపోవడం అత్యంత దారుణం.

నిర్వహణకు నిధులు

ప్రతి మంగళ, బుధవారం నిర్వహించే ఈ కార్యక్రమ నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. రబీ సీజన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లాకు రూ.2.50,000 మంజూరు చేస్తోంది. ఇందులో ఒక్కసారిగా కొనుగోలు చేయాల్సినవి ఫ్లెక్సీకి రూ.150లు, కరపత్రాల ముద్రణకు రూ.3000, ఇక ప్రతి సమావేశానికి రూ.1500లతో పాటు మైకు, టీ, బిస్కెట్‌లకు రూ.1000 మంజూరు చేస్తోంది. ప్రతి సమావేశానికి ఆయా మండలాల వ్యవసాయ అధికారులు, సిబ్బంది హాజరై 30 నుంచి 50 మంది రైతులను సేకరించి వారితో కలిసి క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు సమావేశాన్ని నిర్వహించాలి.

అధికారులందరూ తప్పక హాజరు కావాలి

పొలం పిలుస్తోంది కార్యక్రమానికి వ్యవసాయశాఖలోని ప్రతి అనుబంధశాఖ అధికారి తప్పనిసరిగా హాజరుకావాలి. క్షేత్రస్థాయిలో ఆవిధంగా జరగడం లేదు. ఈ విషయాన్ని కలెక్టర్‌తో పాటు వ్యవసాయశాఖ కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లి మరింత సమర్ధవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం. అక్కడక్కడా కొంతమంది ఉన్నతాధికారులు మాత్రం హాజరవుతున్నారు.

- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల



మహానంది మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

ముందురోజే సమాచారం ఇస్తున్నా..

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు సైతం అటువైపు కన్నెత్తి చూడడంలేదు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు ముందురోజే సమాచారం ఇస్తున్నా ఏఒక్కరూ హాజరుకావడం లేదు. ఇక ఎమ్మెల్యేలు, ఎంపీలు అటువైపు ఆలోచనే చేయకపోవడంతో అధికారులు కూడా కార్యక్రమాన్ని తూతూమంత్రంగా ముగించేస్తున్నారు. కార్యక్రమాన్ని ప్రతి వారానికి బదులు ప్రతి 15రోజులకు ఒకసారి నిర్వహిస్తే బాగుంటుందనే అభిప్రాయం కూడా వారిలో వ్యక్తమవుతోంది.

'పీఎం సూర్యఘర్' అమలులో పురోగతి తేవాలి

- మోడల్ సోలార్ విలేజీ నియోజకవర్గానికి ఒక గ్రామం ఎంపిక
- కలెక్టర్ రంజిత్‌బాషా
- పథకాల అమలుపై అధికారులతో సమీక్ష

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎం సూర్యఘర్ అమలులో పురోగతి తీసుకురావాలని కలెక్టర్ రంజిత్ బాషా ఏపీఎస్ పీడీసీఎల్ ఎస్ఈని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలు పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకం కింద ఇప్పటి వరకు 87,477 మంది రిజిస్టర్ అయ్యారని, ఏపీఈఆర్‌సీ నుంచి ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అప్రూవల్ వచ్చిన వెంటనే ప్రాజెక్టులు ప్రారంభించేందుకు తగినచర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. ఇతరు లకు సంబంధించి కేవలం 442 మాత్రమే చేశారనీ వాటిలో కూడా పురో గతి తీసుకురావాలన్నారు. మోడల్ సోలార్ గ్రామాల కింద నియోజకవర్గా నికి ఒక గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. మోడల్ సోలార్ గ్రామాల్లో 100 ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేయాలన్నారు. పీఎం కుసుమ్‌కి సంబంధించి మే 8వ తేదీన టెండరు పనులు పూర్తికాగానే వాటిని ఏవిధంగా ఇన్‌స్టాల్ చేయాలనే యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీఎస్ఎల్ ఎస్ఈ ఉమాపతి, ఈఈ ఓబులేసు, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, మెప్మా పీడీ నాగశివలీల పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, సభ్యులు

ఆధునిక సాహిత్యంలో శ్రీశ్రీ చెరగని ముద్ర

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగు సాహిత్యంలో మహాకవి శ్రీశ్రీ సుస్థిర స్థానం సంపాదించారని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య కొనియాడారు. బుధవారం శ్రీశ్రీ 116వ జయంతిని టీజీవీ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. పలువురు కవులు, కళాకారులు శ్రీశ్రీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యాన్ని మలుపు తిప్పిన ఘనత శ్రీశ్రీదే అన్నారు. కవిత్వ ప్రస్తావన చేయాలంటే శ్రీశ్రీకి ముందు, శ్రీశ్రీకి తర్వాత అనే ఒరవడిని ఆయన సృష్టించారన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి మహ్మద్ మియా, సాహితి స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, కళాకారులు, జీవీ శ్రీనివాసరెడ్డి, కే.బాల వెంకటేశ్వర్లు, బసవరాజు, కళాక్షేత్రం సభ్యులు ఈశ్వరయ్య, సంగా ఆంజనేయులు, యాగంటీశ్వరప్ప, కదిరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామ దేవత ఉత్సవాలు

- అమ్మవార్లకు జల, పుష్పాభిషేకం
- మొక్కులు తీర్చుకున్న భక్తులు



అమ్మవారి వేషధారణలో పశ్చిమ గోదావరి జిల్లా కళాకారుల నృత్యాలు



పార్లపల్లిలో కుంభోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లి, కలుగోట్ల గ్రామాల్లో గ్రామదేవత ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున అమ్మవార్లకు జలాభిషేకం, పుష్పాభిషేకం, కుంకుమార్చన చేసి ప్రత్యేక అలంకరణ చేసి మహా మంగళ హరతి ఇచ్చారు. అనంతరం గ్రామాల్లోని మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో కుంభాలతో నైవేద్యాలు తీసుకెళ్లి అమ్మవార్లకు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. పార్లపల్లి గ్రామంలో పశ్చిమ గోదావరి జిల్లా నుంచి వచ్చిన కళాకారులు అమ్మవారి వేషధారణలో చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కలుగోట్ల, పార్లపల్లి గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు.

కార్మిక పోరాట దినం

5వ పేజీ తరువాయి



కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చేసింది. పలు ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరించేసింది. ఇలాంటి సందర్భంలో 139వ కార్మిక దినోత్సవం వివిధ కార్మిక సంస్థల ఆధ్వర్యంలో పోరాటాలు జరగాల్సి ఉంది.

● హక్కులు హరిస్తున్నారు



ప్రాణత్యాగాలు చేసి కార్మికులు సాధించుకున్న హక్కులు, చట్టాలను ప్రభుత్వాలు హరిస్తున్నాయి. రోజు 8 గంటలు చొప్పున వారంలో 48 గంటల పని విధానం చట్టాలను రద్దు చేసి వారానికి 90 గంటలు పని చేసేలా చట్టాలు తీసుకొస్తున్నారు.

- ఎండీ అంజిబాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, కర్నూలు

● కార్మిక చట్టాలను రద్దు చేసి కోడ్లు తెచ్చారు



కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలు రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చారు. ఇది మేడే స్ఫూర్తికి విరుద్ధం. కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక హక్కులను కాలరాస్తున్నారు.

- ఎస్.మునెప్ప, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కర్నూలు

రంగవల్లికలో రాఘవేంద్రస్వామి

- 400 అడుగుల పొడవు, వెడల్పుతో రంగోలి
- తీర్చిదిద్దిన మైసూర్‌కు చెందిన రంగోలి వరల్డ్ రికార్డు ఆర్టిస్టులు



మంత్రాలయం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి రంగవల్లికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మైసూర్‌కు చెందిన రంగోలి వరల్డ్ రికార్డు ఆర్టిస్టు పునీత్‌కుమార్, లక్ష్మి 400 అడుగుల పొడవు, వెడల్పుతో రాఘవేంద్రస్వామిని రంగోలితో చిత్రీకరించారు. బుధవారం అక్షయ తృతీయ సందర్భంగా 3వేల కేజీల రంగోలితో 22 గంటలు శ్రమించి తొమ్మిది మంది రాఘవేంద్ర స్వామి చిత్రాన్ని వివిధరంగుల ముగ్గుపొడితో అందంగా తీర్చిదిద్దారు. మధ్వమార్గ్ కారిడార్‌లో రాఘవేంద్రస్వామి నిలువుతో వీణ పట్టుకున్న చిత్రీకరణను అలంకరించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. కళాకారులను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం ఇచ్చి సత్కరించారు.

రాజధాని నిర్మాణంతో బంగారు భవిష్యత్

- అమరావతిపై జగన్ రెడ్డి విధ్వంసం
- టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



ఓర్వకల్లు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని నిర్మాణంతో భావితరాలకు బంగారు భవిష్యత్ లభిస్తుందని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని హుశేనాపు రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధాని విధ్వంసానికి గురై అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అమరావతి నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. రూ.45వేల కోట్లతో రాజధాని రూపుదిద్దుకుంటుందని అన్నారు. అమరావతి రాజధాని ప్రపంచంలోనే తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించబోతుందన్నారు. ప్రపంచ బ్యాంకు నుంచి రూ.15వేల కోట్ల రుణం మంజూరైందని జర్మనీకి చెందిన డెవలప్‌మెంట్ బ్యాంకు కేఎస్‌డబ్ల్యూ నుంచి రూ.5వేల కోట్లు రుణం పొందేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో గృహాలు పూర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మరో రూ.4,400 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరా వతిలో రాజధాని నిర్మించడానికి మద్దతు తెలిపి అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరుతో కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టిన జగన్ నిజస్వరూపాన్ని ప్రజలు తెలుసుకున్నారన్నారు. దళిత రైతులపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా దళితులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయించి వారి చేతులకు బేడీలు వేసి జైళ్లకు తరలించిన దుర్మార్గ వ్యక్తి జగన్ అని అన్నారు.

లక్ష్మీనారాయణ హత్య కేసులో ముమ్మర దర్యాప్తు



- రెండు జిల్లాల్లో పోలీసుల విచారణ
- దర్యాప్తు చేస్తున్న అడిషనల్ ఎస్పీ
- ఓ మహిళ పాత్రపై విచారణ
- తెర వెనుక మరి కొందరి పెద్దల హస్తం?

ఆలూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ హత్య కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. ఈ కేసు విచారణ అధికారి అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా నేతృత్వంలో ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, చిప్పగిరి, అనంతపురం జిల్లా గుంతకల్‌లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. లక్ష్మీనారాయణ తరచుగా ఎక్కడ ఉండేవారు? ఆయన ఎలాంటి పంచాయతీలు చేసేవారు? అనే వాటిపై ఆరా తీస్తున్నారు. ఓ భూ వివాదంలో హత్యకు గురైన లక్ష్మీ నారాయణకు గుంతకల్‌కు చెందిన ఓ మహిళతో గొడవలు తారాస్థాయిలో ఉన్నట్లు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలోనే హత్యకు గుంతకల్‌లోనే ప్రణాళిక వేసినట్లు తెలుస్తున్నది. ఇందుకోసం గుంతకల్‌లో అధికార పార్టీకి చెందిన బడా నేత సహాయం కూడా కోరినట్లు సమాచారం. ఇందుకు ఆర్థిక వనరులు ఓ నేత కనుసన్నల్లో సమకూరినట్లు తెలుస్తున్నది. హత్య జరిగిన ప్రాంతంలోంచి నిందితులను స్వయంగా ఆ మహిళ తీసుకుని వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇప్పటికే ఈ కేసులో కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఈ కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు.

కుందూలో మునిగి వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గొర్రెలను మేత కోసం తీసికెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కుందూలో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన రేవనూరు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బాలుడు కుమారుడు జయవర్ధన్(22) గొర్రెలను ఉప్పలూరు సమీపంలోని పంట పొలాల నుండి కుందూనది అవతల గట్టుకు మేత కోసం తోలుకొని వెళ్తా ప్రవాహం ఎక్కువగా ఉన్న చోట మునిగిపోయి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. నదిలో నుండి మృతదేహాన్ని బయటికి తీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రేవనూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తలించినట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు.



మృతదేహాన్ని బయటికి తీస్తున్న గజ ఈతగాళ్లు

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

కర్నూలు క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో బళ్లారి చౌరస్తా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధమవుతున్న పరశురాముడు (26) అనే యువకుడు దుర్మరణం చెందారు. జూపాడుబంగ్లా మండలం తరిగోపుల గ్రామానికి చెందిన పరశురాముడు ఇటీవలే కానిస్టేబుల్ ఫిజికల్ ఈవెంట్‌లో ఉత్తీర్ణత సాధించి రాత పరీక్షకు అర్హత పొందారు. మరో నెల రోజుల్లో రాత పరీక్షలు రాయాలి. ఇందు కోసం సాయికృష్ణ డిగ్రీ కాలేజీ సమీపంలో ఓ గదిని అద్దెకు తీసుకుని పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. బుధవారం తెల్లవారుజామున మిత్రుడు ఎల్లానాయుడుతో కలిసి హైదరాబాదు వైపు నుంచి మోటారు సైకిల్‌పై వస్తున్నారు. బళ్లారి చౌరస్తా సమీపంలో అదుపు తప్పి వీరి మోటారు సైకిల్ కింద పడింది. కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి కింద పడినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో పరుశురాముడు అక్కడికక్కడే మృతి చెందారు. వెనుకాల కూర్చున్న ఎల్లనాయుడుకు స్వల్ప గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

కల్వర్టును ఢీకొన్న లారీ

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తి-కొత్తూరు గ్రామాల మధ్య బుధవారం ఓ లారీ కల్వర్టును ఢీకొట్టింది. వివరాలివీ... భద్రావతి నుంచి కర్నూలుకు బెల్లం లోడుతో వస్తున్న లారీ ప్యాలకుర్తి దాటాక ఎదురుగా వస్తున్న బస్సు మీదకు దూసుకు రావడంతో తప్పించబోయి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ వలి క్షేమంగా బయటపడ్డారు. ఘటనలో లారీ చక్రాలు ఊడిపోవడంతో పాటు పలు భాగాలు దెబ్బతిన్నాయి.

లారీ, ఆటో ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కూరలో బుధవారం మధ్యాహ్నం లారీ ఆటో ఢీకొన్నాయి. కోడుమూరు నుంచి కైరవాడి గ్రామానికి ఇనుప కడ్డీలను తీసుకెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆటో ధ్వంసం అయింది. డ్రైవర్ కుమార్ ఆచారికి తీవ్రగాయాలు కావడంతో కర్నూలు తరలించారు. కాగా రెండు వాహనాలు కూడా కైరవాడికి చెందినట్లు సమాచారం.

స్పిల్‌వే గేట్ల మరమ్మతులకు చర్యలు

- ఎంపీ బైరెడ్డి శబరి



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

అవుకు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వాయర్ స్పిల్‌వే గేట్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్లు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం ఆమె అవుకు రిజర్వాయర్‌ను పరిశీలించిన అనంతరం అవుకు రిజర్వాయర్ స్పిల్‌వే గేట్లు గురించి జేఈ జయప్రకాశ్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పాత మూడు తూముల్లో రెండు బ్లాక్‌కాగా ఒక తూము నుంచి నీరు లీకేజీ అవుతుందని ఆమెకు అధికారి వివరించారు. అవుకు రిజర్వాయర్ సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని బైరెడ్డి శబరి పేర్కొన్నారు.

సకల సౌకర్యాలతో..





దుస్తుల నాణ్యతను పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ ఏపీసీ, ఇన్‌సెట్‌లో పుస్తకాల పరిశీలన

నంద్యాల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించనుంది. విడతల వారీగా అన్నిరకాల సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో మొదటి విడతలో భాగంగా.. తాజాగా బుధవారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న 1,43,707 మంది విద్యార్థులకు దుస్తులు (యూనిఫామ్స్), టెక్స్‌బుక్స్ ప్రభుత్వం సరఫరా చేసింది. దీంతో జిల్లా సమగ్ర శిక్షా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్(ఏపీసీ) ప్రేమంత్ కుమార్ నేతృత్వంలో సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని బనగానపల్లి, బేతంచెర్ల పాఠశాలలో దుస్తులు, టెక్స్‌బుక్స్ (పుస్తకాలను) అన్‌లోడ్ చేశారు. త్వరలోనే ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు కూడా రానున్నాయి. వీటితో పాటు అందరికి త్వరలో షూస్‌తో పాటు బ్యాగులు కూడా రానున్నాయి. ఏది ఏమైనా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో.. 2025-26కి సంబంధించి ప్రణాళికా బద్ధంగా విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం సదరు విద్యార్థులకు వరంగా మారినట్లైంది.

విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం



ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యా ర్థులకు అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పించనుంది. ఇదే క్రమంలో పాఠశాలలో విద్యార్థులు చేరే సంఖ్య కూడా ఈ ఏడాది పెరిగే అవకాశం లేకపోలేదు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో సైతం ఇదే తరహాలో సదుపాయాలు, సౌకర్యాలు కల్పించడం జరుగుతోంది.

- నాణ్యమైన విద్యే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలలు
- పేద విద్యార్థులకు శుభవార్త
- ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు యూనిఫామ్స్, బుక్స్ సరఫరా
- త్వరలో బ్యాగ్‌లు, షూస్
- విద్యార్థులు పెరిగే అవకాశం

ఎంతో నాణ్యతగా ఉన్నాయి



ప్రభుత్వం విద్యార్థులకు అందించిన దుస్తుల మెటీరి యల్ ఎంతో నాణ్యతగా ఉన్నాయి. 2025-26 విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే దుస్తులు, బుక్స్ సరఫరా చేశారు. త్వరలోనే బ్యాగులు, షూష్ కూడా వస్తాయి. కార్పొరేట్ దిశగా సేవలు అభినందనీయం. **- ప్రేమంత్‌కుమార్, ఏపీసీ సమగ్ర శిక్షా, నంద్యాల**

మొదటి విడతలో భాగంగా..

మొదటి విడతలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో 6నుంచి 10వ తరగతి చదువుతున్న 1,43,707మంది విద్యార్థులకు సంబంధించి.. ఒక్కొక్కరికి మూడు జతల చొప్పున దుస్తుల మెటీరియల్ ప్రభుత్వం సరఫరా చేస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ముందస్తు పంపిణీ చేయడం గమనార్హం. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ కూడా విద్యార్థులకు అందించనున్నారు.

మరో వారంలో...

రెండవ విడతగా ప్రభుత్వ పాఠశా లలో 1నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బుక్స్‌తో పాటు వర్క్ బుక్స్, దుస్తులు సరఫరా చేయనున్నారు. దుస్తుల మెటీరియల్‌ను కుట్టించడం కోసం అయ్యే ఖర్చును కూడా ఆయా విద్యార్థుల వారీగా తల్లుల ఖాతాలకు జమచేయనున్నారు.

ప్రాణాలు తీసే పిడుగులు

- అవగాహనతో జాగ్రత్తలు తీసుకోవాలి
- సాంకేతికత పెరిగినా తగ్గని ప్రమాదాలు



కొలిమిగుండ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటు ప్రాణాంతకం. వేసవి కాలంలో వానలు కురిసేటప్పుడు మేఘాల్లో జరిగే అలజడి కారణంగా పిడుగులు పడతాయి. పిడుగుపాటుకు మనుషులే కాదు జంతువులు కూడా మరణిస్తుంటాయి. పెరిగిన సాంకేతికతతో విపత్తుల నిర్వహణ సంస్థ ఎప్పటికప్పుడు మొబైల్ ఫోన్‌ల ద్వారా మేసేజ్ పంపుతూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నా అప్పుడప్పుడు పిడుగుల వల్ల తీవ్ర ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ ఏడాది ఏప్రిల్ మాసంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో 10 వరకూ మృత్యువాత పడగా, పలుచోట్ల పశువులు, ఇతర జంతువులు మృత్యువాత పడ్డాయి. గృహోపకరణాలు కాలిపోయిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇంతటి తీవ్రమైన సమస్య పట్ల ప్రజల్లో అవగాహన లేకపోవడం తీవ్ర బాధాకరమని పలువురు వాపోతున్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకున్నా ప్రాణాలు నిలుపుకునే అవకాశం ఉన్నా గ్రామీణ ప్రజల్లో మార్పు రావడంలేదు.

సాంకేతికత పెరిగినా అవగాహనలేమి

గతంతో పోలిస్తే వాతావరణంలో వచ్చిన మార్పులను విపత్తుల నిర్వహణ సంస్థ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తోంది. ప్రతి ఒక్కరి దగ్గర సెల్‌ఫోన్ ఉంటుంది. తెలుగులోనే సందేశాలు వస్తున్నాయి. వాతావరణ శాఖ మేసేజ్ పంపిన సమయంలో ఖచ్చితంగా పిడుగులు పడుతూనే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పొలాల్లోకి వెళ్లిన గొర్రెల కాపర్లను, రైతులను వారి కుటుంబ సభ్యులు అప్రమత్తం చేస్తే ప్రాణాపాయం నుండి బయటపడే అవకాశం వుంది. అయినా చిన్నపాటి జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రజలు నర్లక్ష్యం వహిస్తున్నారు.

పిడుగుకు 30 కోట్ల మెగా వాట్ల శక్తి ఉంటుంది

ఒక పిడుగుకు సుమారు 30కోట్ల మెగావాట్ల శక్తి ఉంటుంది. మేఘాలలో నీరు ద్రవ, ఘన రూపంలోకి మారే సమయంలో రుణ, ధనావేశాలు ఏర్పడతాయి. ఆక్రమంలో ఉన్న ఫలంగా మేఘాల నుంచి ఎలక్ట్రాన్లు విడుదలై వాయు వేగంతో భూమిపైకి దూసుకవస్తాయి. వీటినే పిడుగుపాటు అంటారు. అవి ఎత్తైన ప్రదేశాలలో అధికంగా పడతాయి, పెద్ద చెట్లు, భవనాలు, నీటి కొలనులు, లోహం సమూహాలను ఎక్కువగా ఆకర్షిస్తాయి.

ఏప్రిల్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో మరణాల సంఖ్య

- ఈఏడాది ప్రస్తుత ఏప్రిల్ మాసంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 10మంది పిడుగు పాటుకు మృత్యువాత పడ్డారంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది.
- ఏప్రిల్-16న చిప్పగిరి మండలం ఏరూరు గ్రామంలో రజియా అనే మహిళ పిడుగు పాటుకు మరణించింది.
- ఏప్రిల్-18న బనగానపల్లె మండలం రామతీర్థం గ్రామంలో బషీర్‌అహ్మద్ మృతి చెందాడు.
- ఏప్రిల్-20న పెద్దకడుబూరు మండలం హనుమాపురం గ్రామానికి చెందిన ఈరన్న, చిప్పగిరికి చెందిన శివన్న, ఎమ్మిగనూరు మండలం హెచ్. మూరవాణి గ్రామానికి చెందిన అడివన్న మృతి చెందారు.
- ఏప్రిల్-21న నందికొట్కూరు మండలం కొణిదేల గ్రామానికి చెందిన వడ్డె లక్ష్మీనరసింహ మృతి చెందాడు.
- ఏప్రిల్-27న కౌతాళం మండలం కాత్రికి గ్రామానికి చెందిన అశోక్, బాలయ్య అనే ఇరువురు యువకులతో పాటు క్రిష్ణగిరి మండలం కటారుకొండ గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు మృతి చెందారు. వీరితో పాటు చాలా గ్రామాల్లో గొర్రెలు, మేకలు, పశువులు మృత్యువాత పడటంతో పాటు, ఆస్తి నష్టం జరిగింది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పొలాల్లో పని చేస్తున్న వారు త్వరితగతిన ఇళ్లకు చేరుకోవాలి. అందుబాటులో ఉన్న భవనాల్లోకి వెళ్లాలి.
- ఎత్తయిన ప్రదేశాల్లో, పెద్ద చెట్ల కింద, భవనాలపైన ఉండకూడదు.
- వర్షంలో చిక్కినప్పుడు వెంటనే మొబైల్ ఫోన్ స్విచ్చాఫ్ చేసుకోవాలి.
- బహిరంగ ప్రదేశాల్లో నిలిచిపోయి, ఎటూ వెళ్లలేని పరిస్థితి ఉంటే మోకాళ్ల మధ్య తల వంచి కూర్చొని, రెండు చెవులూ మూసుకోవాలి.
- ఉరుములు, మెరుపులను కంటితో చూడకూడదు. చూపు మందగిస్తుంది.
- ఉరుములతో వర్షం కురుస్తున్నప్పుడు పొలాల్లో నీళ్లు కట్టడం, ఇంట్లో స్నానాలు చేయడం.. వంటి నీటితో చేసే పనులు ఆపేయాలి.

పల్లె రోడ్లకు మహర్దశ

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 25 పనులు
- మరమ్మతులకు రూ.39.83 కోట్లు మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



(ఫైల్)

నంద్యాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పల్లె రోడ్ల బాగుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పల్లె రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టిసారించి రూ.కోట్ల నిధులు మంజూరు చేసి పల్లెరోడ్లను బాగు కోసం కృషి చేస్తున్నారు. తాజాగా మరోమారు కేంద్రంతో పాటు రాష్ట్ర వాటాతో కలిపి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోడ్ల మరమ్మతుల కోసం రూ.39.83 కోట్లు మంజూరు చేసింది. 25 పనుల్లో పరంగా 88.46 కిలోమీటర్ల బీటీ(తారు) రోడ్లకు ఈ నిధులు వినియోగించనున్నారు. ఇందులో కూడా కర్నూలు జిల్లాలో 43 కిలోమీటర్లు, నంద్యాల జిల్లాలో 45.46 కిలోమీటర్లలో మరమ్మతు పనులు చేస్తారు. కర్నూలు జిల్లాకు రూ.19.68 కోట్లు, నంద్యాల జిల్లాకు రూ.20.15 కోట్లు కేటాయించారు. ఇదిలా ఉండగా గ్రామీణ రహదారులకు మోక్షం కలిగే విధంగా కూటమి ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా విడతల వారీగా నిధులు కేటాయించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. త్వరలోనే ఈ పనులకు సంబంధించి టెండర్లు పిలవనున్నారు.

పల్లె రోడ్లకు నిధులు

పల్లె రోడ్లకు కేంద్ర, రాష్ట్ర సహకారంతో ఉమ్మడి జిల్లాకు నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే టెండర్లు పిలుస్తాము. ఎస్సీ, ఎస్టీ, సాధారణ ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ పనులు చేయడం జరుగుతుంది. గతంలో రోడ్లను గుర్తించి నివేదించడం జరిగింది. ఇంతమునుపు కూడా ప్రభుత్వం రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది.

- నాగరాజు, డీపీఆర్‌ఈవో, పంచాయతీ రాజ్ శాఖ

ప్రియుడి ఇంటి ఎదుట ట్రాన్స్‌జెండర్ ధర్నా



బైచిగేరిలో హసినిగౌడ్‌తో మాట్లాడుతున్న పోలీసులు



ఆదోని రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేశాడంటూ ప్రియుడి ఇంటి ఎదుట ఓ ట్రాన్స్ జెండర్ బైఠాయించి ఆందోళన చేసిన సంఘటన ఆదోని మండలం బైచిగేరి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత ట్రాన్స్‌జెండర్ కథనం మేరకు వివరాలు ఇలా... బైచిగేరి గ్రామానికి చెందిన గణేష్, హైదరాబాద్ సిటీ సనత్‌నగర్‌కు చెందిన ట్రాన్స్‌జెండర్ హసిని గౌడ్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం అయ్యారు. పరిచయం కాస్తా ప్రేమగా మారడంతో వారు గత కొంత కాలంగా సహజీవనం చేశారు. గణేష్ ప్రేమలో పడిన హసిని గౌడ్ అతడికి ఖరీదైన సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, దుస్తులతో పాటు రూ.లక్షల్లో డబ్బు కూడా ఇచ్చింది. ఈ క్రమంలో గతేడాది జూన్‌లో వారిద్దరూ హైదరాబాద్‌లోని ఓ ఆలయంలో వివాహం కూడా చేసుకున్నారు. ఈ విషయాన్ని గణేష్ తన ఇంట్లో చెప్ప కుండా కాలం వెళ్లదీశాడు. వివాహం అనంతరం గణేష్ సొంతూరికి వెళ్ళి తిరిగి రాకపోవడంతో మోసపోయానని తెలిసిన హసినిగౌడ్ హైదరాబాద్ సనత్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ సమయంలో యువకుడు గణేష్ ఓ వివాహం చేసుకున్నాడు. తర్వాత ఈ ఏడాది ఏప్రిల్ 23వ తేదిన మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. వరుస ఘటనలను నిలదీస్తూ ట్రాన్స్‌జెండర్ హసిని గౌడ్ యువకుడి ఇంటి ఎదుట బైఠాయిం చింది. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. రెండు వివాహాల తర్వాత కూడా తనతో మాట్లాడుతున్నాడని, ముగ్గురం కలసి ఉందామని తనకు ఆశలు రేకెత్తించి మళ్లీ మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. విషయం తెలుసుకున్న తాలూక పోలీసులు గ్రామానికి చేరుకుని హసినితో పాటు అక్కడ ఉన్న మిగిలిన ట్రాన్స్‌జెండర్లను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

ఇంజక్షన్‌తో ప్రాణాలు కాపాడారు

వెల్దుర్తి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఛాతి నొప్పితో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు సకాలంలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడిన ఘటన వెల్దుర్తిలో చోటు చేసుకుంది. వివరాలివీ.. అల్లుగుండు గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, వెల్దుర్తికి చెందిన నాగరాజు, గోవర్ధనగిరికి చెందిన నాగార్జున బుధవారం ఛాతీనొప్పితో వెల్దుర్తి ఆసుపత్రిలో చేరారు. వైద్యులు వరప్రసాద్, రంగస్వామి ఈసీజీ తదితర వైద్యపరీక్షలు నిర్వహించి గుండెపోటుగా నిర్ధారించారు. వెనువెంటనే వారికి రూ.45వేలు విలువ చేసే 'టెనెక్టప్లస్' ఇంజక్షన్ వేశారు. దీంతో వారికి ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. గుండెపోటుతో నిరుపేద ప్రజలు మరణించరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం భరోసానిస్తోందన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో గుండెపోటు ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని, గుండెపోటు వచ్చిన మొదటి గంటలోపు రోగిని ఆసుపత్రికి తీసుకువస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని సూపరిండెంట్ బాలచంద్రారెడ్డి తెలిపారు.

ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండలంలోని సోమయాజులపల్లె, కొమరోలు గ్రామాల్లో ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులు పండ్ల తోటలను సాగు చేసి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా పంట మొక్కలను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు రామచంద్రుడు, జయమ్మ, ఏపీవో మాదేశ్వరమ్మ, రైతులు పాల్గొన్నారు.

మే డేను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మే డేను జయప్రదం చేయాలని సీఐటీయూ నగర కార్యదర్శి రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మే డేను పురస్కరిం చుకుని గురువారం ఉదయం 10 గంటలకు బళ్లారి చౌరస్తా నుంచి కార్మిక ప్రదర్శన, మార్కెట్ యార్డులో బహిరంగ సభ ఉంటుంద న్నారు. కార్మికులు హాజరై మే డేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వాహనాల తనిఖీ

సి.బెళగల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్‌లో ఎస్ఐ పరమేష్‌నాయక్ బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో భాగంగా ద్విచక్ర వాహనాదారులకు రూ.4,546 జరిమానా విధించారు. అలాగే జరిమాని చెల్లించని వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామా లలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేస్తా మన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ తిమ్మప్ప, పోలీసులు ఉన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోవాలి

సి.బెళగల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులను వినియోగించుకోవాలని ఎంపీడీవో రాణెమ్మ కూలీలకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో జాబు కార్డు ఉన్నవారంతా ఉపాధి పనులను వినియో గించుకునేలా చూడాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఉపాధి పనులకు హాజరైన కూలీలకు మాత్రమే మస్టర్‌లో హాజరు వేయాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పనులకు కూలీలు ఉదయాన్నే వెళ్లాలన్నారు. అలాగే 12 గ్రామ పంచాయతీలకు మంజూరైన నీటి తొట్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఈస మావేశంలో ఏపీవో రామన్న, ఈసీ రంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలుపై హర్షం

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బర్లీ పొగా కును వెంటనే కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేయడంపై రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 20 రోజులుగా బర్లీ పొగాకు రైతుల సమస్యలను పరిష్కరించాలని, క్వింటం రూ.18 వేల చొప్పున తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేశామ న్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐటీసీ, జీపీ, ఆలయన్స్, వీఎస్ కంపెనీలు తక్షణమే పొగాకు కొనుగోలు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈసమావేశంలో నగర కార్యదర్శి పి.రామ కృష్ణారెడ్డి, అన్వర్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కర్నూలు క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన తండ్రి మందలించాడని 9వ తరగతి విద్యార్థి సాల్మాన్ ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. బుధవారం రాత్రి తండ్రి షేక్షావలి, కొడుకు సాల్మాన్‌ను స్నేహితుల వెంట తిరుగుతున్నావని మందలించాడు. మనస్తాపానికి గురైన సాల్మాన్ ఇంటిపైకి వెళ్లి ఉరి వేసుకునేందుకు ప్రయత్నించాడు. తండ్రి గుర్తించి ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విష్ణు నియామకంపై టీడీపీ శ్రేణుల సంబరాలు

గూడూరు ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి నియామకంపై టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బుధవారం గూడూరులో నగర పంచాయతీ మాజీ వైస్ ఛైర్మన్ కురుకుంద రామాంజనేయులు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు పాత బస్టాండ్ బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. రామాంజనేయులు మాట్లాడుతూ విష్ణువర్ధన్‌రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కేడీసీసీ ఛైర్మన్ పదవి ఇచ్చారని, ఇంకా మరెన్నో ఉన్నత పద వులను విష్ణుని వరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సృజన్, రేమట వెంకటేశ్వర్లు, పౌలు, కౌన్సిలర్లు రేమట సురేష్, కలాం, బుడ్డంగలి, దానమన్న, నాగప్ప యాదవ్, చాంద్ బాషా, డాక్టర్ మన్నన్ బాషా, తెలుగు శ్రీను, విజయ్ కుమార్, అక్కల దేవి, గిడ్డయ్య పాల్గొన్నారు.

అదుపు తప్పిన బైక్

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరి గ్రామ శివారులో బుధవారం సాయంత్రం ఓ బైక్ అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు వెంకటగిరి గ్రామానికి చెందిన శివ పనిమీద వెల్దుర్తికి వెళ్లి అనంతరం స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే లద్దగిరి వంతెన సమీపాన బైక్ అదుపుతప్పింది. రోడ్డు పక్క పొలాల్లోకి దూసుకుపో వడంతో శివ కిందపడ్డాడు. వాహనదారులు సహాయక చర్యలు చేపట్టడంతో స్వగ్రామానికి తిరిగి బయలుదేరాడు.

ఘనంగా బసవ జయంతి

కోడుమూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక పేట మల్లేశ్వర స్వామి ఆలయంలో బసవేశ్వరస్వామి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో శివలింగం, పార్వతిదేవి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నందీశ్వరుడు విగ్రహాలకు మహా రుద్రాభిషేకం, పంచద్రవ్యాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం వీరశైవుల శివాష్టోత్తర శతనామావళి, బసవేశ్వర శతనామావళి, బిల్వాష్టకం, లింగాష్టకం, కుంకుమార్చన వంటి కార్యక్ర మాలు నిర్వహించారు. సాయంత్రం బసవేశ్వర స్వామి చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ఎస్‌జీ శంకర్‌బాబు, వీరప్ప, బసన్నశెట్టి, దామోదర్, శ్రీకాంత్, చంద్రశేఖర్, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

సి.బెళగల్: మండలంలోని గొల్లలదొడ్డి దారిలో వెలసిన బసవేశ్వర స్వామికి బుధవారం భక్తులు పూజలు చేశారు. అనంతరం స్వామివారిని చిత్రపటాన్ని ఎడ్లబండిపై ఊరేగిం చారు. స్వామివారికి భక్తులు కాయకర్పూరాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆకుల బసయ్య, విశ్వేరుడు, నాగసాయి, ఓం సాయి పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో సాహితి స్రవంతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో బసవేశ్వరుడి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ భూమిపై శ్రమజీవులతోనే సమాజం నిర్మితమైందని మానవత్వమే ఈ సమాజానికి జీవనా ధారమని చాటి చెప్పిన విశ్వగురువు బసవేశ్వరుడే అని అ న్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పిం చారు. సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు బసవరాజు, విరసం నాయకులు నాగేశ్వర ఆచారి పాల్గొన్నారు.



సి.బెళగల్‌లో బసవేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



బసవేశ్వర స్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న సంఘం సభ్యులు



బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సాహితీ స్రవంతి సంస్థ ప్రతినిధులు

● నగరంలోని వీర శైవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బసవేశ్వర జయంతిని నిర్వహించారు. ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ నగరంలోని బంగారుపేట శ్రీరామ థియేటర్ వద్ద గల సర్కిల్‌ను నగర పాలక సంస్థ బసవ సర్కిల్‌గా నామకరణం చేసినందున హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీరశైవ ఐక్యవేదిక నాయకులు ఏజీ మల్లికార్జునప్ప, ఎస్‌వీ శివరాజు, జి.చంద్రశేఖరప్ప, శెట్టి వీరశేఖరప్ప, జంగం విశ్వేశ్వరయ్య, జే.మల్లికార్జునయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌కు దోచిపెడుతున్నారు

అధికారుల తీరుపై మండిపడ్డ వైస్ ఛైర్మన్

గూడూరు ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల పేరిట ప్రజల సొమ్మును కాంట్రాక్టర్‌కు దోచిపెడుతున్నారని నగర పంచాయతీ అధికారుల తీరుపై వైస్ ఛైర్మన్ పీఎన్ అస్లాం మండిపడ్డారు. బుధవారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్మన్ జె వెంకటేశ్వర్లు అధ్యక్షతన నగర పంచాయతీ సమావేశం జరిగింది. అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. సమావేశం ప్రారం భం కాగానే ఎప్పుడో చేసిన పనులకు ఇప్పుడు కౌన్సిల్ అనుమతి అంటూ అజెండాలో ఎందుకు పెట్టారని వైస్ ఛైర్మన్ పీఎన్ అస్లాం కమిషనర్ రమేష్‌బాబును ప్రశ్నించారు. డ్రైయిన్‌లను డిసిల్టింగ్ చేసే పనులు ఎప్పుడో పూర్తి చేస్తారని, మరి ఇప్పుడు కౌన్సిల్ అమోదం కోసం ఉంచడం ఏమిటని ప్రశ్నించారు. జనరల్ ఫండ్‌లోని నిధులను కాంట్రాక్టర్‌కు చెల్లించాలని కౌన్సిల్ అమోదానికి అజెం డాలో ఉంచడం సరికాదన్నారు. అలాగే అన్న క్యాంటీన్ భవనం మరమ్మతు పనులు ఎప్పుడో పూర్తి చేస్తారని ఇప్పుడు అజెండాలో ఎందుకు పెట్టారని కమిషనర్‌ను వైస్ ఛైర్మన్ ప్రశ్నించారు. ఎప్పుడో జరిగిన పనులకు జనరల్ ఫండ్ ద్వారా చెల్లింపులు ఎలా చేస్తార న్నారు. కేవలం అభివృద్ధి పనుల పేరిట దోపిడీ జరుగుతుందని, నగర పంచాయతీ అధికారులు కాంట్రాక్టర్‌కు దోచి పెడుతున్నారని ఆరోపించారు. ఈ పనులకు సంబంధించిన చెల్లింపులు పెండింగ్‌లో ఉంచాలని డిమాండ్ చేశారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ గతంలో పనులు జరిగిన సమయంలో తానులేనని అన్న క్యాంటీన్ మరమ్మతులకు సంబంధించి నిధులు రాలేదని, అందుకే జనరల్ ఫండ్ ద్వారా కాంట్రాక్టర్‌కు చెల్లింపులు చేసేందుకు అజెండాలో కౌన్సిల్ అనుమతి కోసం ఉంచామన్నారు. సభ్యులు తీర్మాణం చేస్తే చెల్లిస్తాం లేదంటే పెండింగ్‌లో ఉంచుతామన్నారు. దీనికి వైస్ ఛైర్మన్ పీఎన్ అస్లాం, మరికొందరు కౌన్సిలర్లు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉంచాలని సూచించారు. అలాగే శానిటేష్ అధ్వానంగా ఉందని అధికారులు ఏం చేస్తున్నారని పలువురు కౌన్సిలర్లు మండిపడ్డారు. అలాగే ఆయా కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని కౌన్సి లర్లు సమావేశం దృష్టికి తెచ్చారు. ఈసమావేశంలో మేనేజర్ విజయ లక్ష్మి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న వైస్ ఛైర్మన్ పీఎన్ అస్లాం

గోరంట్ల మాధవ్.. నోరు అదుపులో పెట్టుకో

వై.నాగేశ్వరరావు యాదవ్



మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి బెయిల్‌పై విడుదల అయిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ తన నోరు అదుపులో పెట్టుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైస్ భారతి టీడీపీ కార్యకర్త కిరణ్ అసభ్య మాటలు మాట్లాడటంతో వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసి కేసుల నమోదుకు ఆదేశించిందన్నారు. గతంలో వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు టీడీపీ నాయకులను తిడితే అప్పటి సీఎంగా జగన్‌రెడ్డి సునకానందం పొందారని, కానీ ప్రస్తుతం టీడీపీ పాలన అందుకు భిన్నంగా సాగుతోందన్నారు. సమావేశంలో కార్పొరేషన్ల డైరెక్టర్లు పోతురాజు రవికుమార్, ధరూర్ జేమ్స్, హనుమంతరావు చౌదరి, రజక రాంబాబు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రం తనిఖీ

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామ్ హెల్త్ క్లినిక్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాన్ని జిల్లా సంచార చికిత్స కార్యక్రమం నోడల్ అధికారి డాక్టర్ రఘు బుధవారం తనిఖీ చేశారు. రిజిస్టర్ రెన్యువల్‌కు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. అనంతరం స్కానింగ్ కేంద్రంలోని మిషన్లు, రిజిస్టర్‌లో నమోదు వాటి వరుస సంఖ్య తయారీ కంపెనీల పేర్లను సరిపోల్చి చూశారు. గర్భిణీల నమోదు రిజిస్టర్‌ను లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని తెలిపే బోర్డులను పరిశీలించారు.

విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించాలి

మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్



రికార్డులను పరిశీలిస్తున్న ఏవో రవిప్రకాష్

కోడుమూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): విత్తనాలను ఎమ్మార్పీకే రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ అన్నారు. స్థానిక విశ్వజిత్ ట్రేడర్స్ దుకాణాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీలకు సంబంధించిన పత్తి, మిరప విత్తనాలు వాటికి సంబంధించిన రికార్డులను పరి శీలించారు. ఆయన మాట్లాడుతూ విత్తనాలకు సంబంధించిన రికార్డులు కచ్చితంగా అందుబాటులో ఉంచుకోవాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని అన్నారు. రైతులు అడిగిన విత్తనాలను మాత్రమే ఇవ్వాలని, రైతులకు కనిపించే విధంగా ధరల పట్టిక, విత్తనాల స్టాక్ వంటి వివరాలు బోర్డులో ఉంచాలని సూచించారు. నాసిరకం విత్తనాలను రైతులకు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పీడీఎస్ దుర్వినియోగంపై చర్చించాం

నారా లోకేశ్‌ను కలిసిన మహేష్ నాయుడు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పీడీఎస్ దుర్విని యోగంపై మంత్రి లోకేశ్‌తో చర్చించామని సివిల్ సప్లైస్ డైరెక్టర్ మహేష్ నాయుడు తెలిపారు. బుధవారం ఉండవల్లిలో మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ మాఫియా పూర్తిగా నిర్మూలన చేయడమే లక్ష్యమని, అనేక జిల్లాల్లో అక్రమ రవాణా, మిల్లర్లతో ఉన్న సంబంధాలు, నకిలీ రేషన్ కార్డుల ద్వారా బియ్యం దుర్వినియోగంపై చర్చించామని తెలిపారు. ప్రతి మండలంలో అక్రమ గోదాములపై స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామన్నారు.



మంత్రి నారా లోకేశ్‌తో మహేష్ నాయుడు

ర్యాంపులు ఉండేలా చర్యలు తీసుకోండి

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలు అన్నింటిలోనూ ర్యాంపులు ఉండే విధంగా చర్యలు చేపడుతామని డీఆర్వో వెంకట నారాయణమ్మ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి వైకల్య కమిటీ సమావేశాన్ని సంబంధిత అధికారులతో నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శారీరక వికలాంగులకు ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులు అప్రూవ్ చేసేవి చాలా పెండింగ్‌లో ఉన్నా యని మెంబర్లు తన దృష్టికి తీసుకుని వచ్చారని, వాటిని వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా స్థాయి వైకల్య కమిటీ సమావేశాన్ని 6 నెలలకు ఒకసారి నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఈవో శామ్యూల్ పాల్, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు రాయిస్ ఫాతిమా, ఎల్‌జీఎం రామచంద్ర రావు, జిల్లా స్థాయి వైకల్య కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

క్యాడెట్స్ డిఫెన్స్ శిక్షణ ప్రారంభం



లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని బిర్లాగేటు సమీపంలో గల కృష్ణకాంత్ ప్లాజా మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన క్యాడెట్స్ డిఫెన్స్ అకాడమీ శిక్షణను ఏపీ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంకతి లక్ష్మీనారాయణ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అకాడమీలో నవోదయ, సైనిక్ స్కూళ్లలో ప్రవేశాలకు శిక్షణలు, టెక్నో వర్షన్‌లో అందించడం అభినందనీయమన్నారు. అకాడమి డైరెక్టర్లు కస్తూరి చంద్రశేఖర్, సి.విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ విద్యా విధానం ఎన్నో కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో టెక్నో వర్షన్‌లో ప్రారంభించనున్న సైనిక్ స్కూల్ ప్రవేశాల శిక్షణలు విద్యార్థులు అందిపుచ్చుకోవాలని కోరారు. ఈసందర్భంగా కొంకతి లక్ష్మీనారాయణను సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్ఐ మల్లికార్జునను ఆదర్శంగా తీసుకోవాలి

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఎస్ఐ మల్లికార్జునను ఆదర్శంగా తీసుకోవాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు అన్నారు. బుధవారం జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో పదవీ విరమణ కార్యక్రమానికి సూపరింటెండెంట్ సుధీర్‌బాబుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 39 సంవత్సరాలు తన సర్వీసులో ప్రతి అధికారి, తోటి ఉద్యోగులతో ఎంతో ఆప్యాయంగా మెలిగారని కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్‌గౌడ్, వి.రాముడు, ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, జిల్లా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ఐ మల్లికార్జున దంపతులను సన్మానిస్తున్న అధికారులు

సింహాచలం ఘటనపై ఎంపీ దిగ్భ్రాంతి

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని సింహాద్రీ అప్పన్న స్వామి ఆలయం ప్రహరీ కూలీ ఏడుగురు భక్తులు మృతి చెందడంపై ఎంపీ బస్తిపాటి నాగరాజు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. భారీ వర్షాలతో ప్రహరీ కూలిందని, ఈ ఘటనలో మర ణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

● **కేంద్ర క్యాబినెట్ నిర్ణయంపై హర్షం:** జనాభా లెక్కలతో పాటు కులగణను చేపట్టేందుకు కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడంపై ఎంపీ బస్తిపాటి నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. సర్వేలకు బదు లుగా జనాభా లెక్కల్లో కులగణను చేరుస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

ఆదర్శ ప్రధాన ఆచార్యులు వీవీఎస్ కుమార్

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆదర్శ ప్రధాన ఆచార్యులు వీవీఎస్ కుమార్ అని క్లస్టర్ ఇన్‌చార్జి ఉపకులపతి వెంకట బసవరావు అన్నారు. బుధవారం సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డి, నాగరాజశెట్టి, ఎం. పమీద బేగం, దేవికారాణి, అనుష, విమల, రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

మోదీ పర్యటనను విజయవంతం చేద్దాం

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 2న రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమరావతి 2.0తో రాష్ట్ర భవిష్యత్ రూపురేఖలు మారతాయన్నారు. రూ. 65 వేల కోట్లతో 217స్క్వేర్ కిమీ 8,03,052 స్క్వేర్ కిమీ విస్తీర్ణంలో రాజధాని అమరావతి రూపుదిద్దుకోబోతోందని తెలిపారు.

పోలీసుల పదవీ విరమణ

కర్నూలు క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో నలుగురు పోలీసు సిబ్బంది బుధవారం పదవీ విరమణ చేశారు. కర్నూలు సీసీఎస్ ఎస్ఐ రమేష్‌బాబు, ఏఆర్ఎస్ఐలు కోటయ్య, రామచంద్రరావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్లు రామాంజనేయులు పదవీ విరమణ పొందినవారిలో ఉన్నారు. వీరందరినీ జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఏఆర్ అడిషినల్ ఎస్పీ హుశేన్‌పీరా శాలువలు, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐలు జావీద్, నారాయణ పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడికి నిరసనగా ర్యాలీ

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గామ్ పర్యాటకులపై ఉగ్రవాదుల దాడికి నిరసనగా బుధవారం జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం ఆధ్వర్యంలో క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల అణిచివేతకు ప్రభుత్వం చేస్తున్న పోరుకు క్రీడాకారుల సంఘీభావాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి అబూబకర్, సీఈవో పి.సునీల్ కుమార్, శిరీష్ బాబు, కోచ్‌లు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ బ్రాండ్ ఇమేజ్ పెంచాలి

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సేవలను ఇంకా విస్తరింపజేసి, రెడ్ క్రాస్ బ్రాండ్ ఇమేజ్ పెరిగేలా చూడాలని కలెక్టర్ రంజిత్‌బాషా సభ్యులకు సూచించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచే చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొ దటి స్కిన్ బ్యాంక్ పూర్తి స్థాయిలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సభ్యులను ఆదేశించారు. రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ కేజీ గోవిందరెడ్డి, సెక్రటరీ వెంకటకృష్ణ, (రిటైర్డు రెవెన్యూ డివిజనల్ అధికారి) మెడికల్ ఆఫీసర్ రామచంద్రరావు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యానగర్‌లోని మాంటిస్సోరి పాఠశాలలో మహాకవి శ్రీశ్రీ జయంతిని ఘనంగా నిర్వహించారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి దేవి ప్రసన్న సాహితి సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డా.బీవీ స్వరూప్ సిన్హా అధ్యక్షత వహించగా, తెలుగు కల్లం సాహితి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.చిన్నవులా వెంకట రాజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శ్రీశ్రీ కవిత్వం నేటి సామాజిక నేపథ్యం అనే అంశంపై ప్రసంగించారు. ఈ సభలో కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన యాత్రికులకు నివాళులర్పించారు. సాహితివేత్తలు ప్రతాప్ రెడ్డి, పద్మావతి, రాజశేఖర్, లక్ష్మీకాంతరెడ్డి, నిరంజన్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణను వినియోగించుకోవాలి

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాల యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్, ఉపగ్రంథాలయ అధికారి వి.పెద్దక్క తెలిపారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణను వారు సందర్శించారు.

దాడి చేసిన వారి అరెస్టు చేయాలి

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన అరెస్టు చేయాలని సిటీ అధ్యక్షుడు షేక్ జీలాని బాషా డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షురాలు వైస్ షర్మిలమ్మపైకి దాడికి ప్రయత్నించిన వారిని అరెస్టు చేయాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ముజఫర్‌నగర్ సమీపంలోని అయ్యప్పస్వామి నగర్ వద్ద మురికి గుంతలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. బుధవారం మురుగు గుంతలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు నాలుగో పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుర్తించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించారు.


పన్ను వసూళ్లలో గోల్‌మాల్

● ప్రైవేటు వ్యక్తులచే వసూళ్లు ● తేదీ లేకుండానే రసీదు.. ● రసీదు చూపకుంటే మళ్లీ కట్టాలని హుకుం ● బొజ్జనాయనిపేట వాసుల అవస్థలు

మద్దికెర, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికెర మజారా గ్రామం బొజ్జనాయనిపేటలో ఇంటి పన్నుల వసూళ్లలో గోల్‌మాల్ జరుగుతున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కట్టిన పన్నులకు రసీదు చూపకపోతే మళ్లీ పన్నులు కట్టాల్సి వస్తోందని, గ్రామస్థులు లబోదిబో మంటున్నారు.

గ్రామంలో 5వేల గృహాలకు పైగా ఉండగా, ఏడాదికి రూ.15 నుంచి రూ.18 లక్షల వరకు పన్నులు రూపంలో వసూలు చేస్తున్నారు. అయితే రెండేళ్ల క్రితం ఇంటి పన్నులు వసూలు చేసే బాధ్యతను ప్రైవేటు సిబ్బందికి అప్పగించారు. ప్రజలు పన్నులు చెల్లించారు. 2024-25 సంవత్సరానికి కూడా ఇలాగే ప్రైవేటు సిబ్బంది వసూలు చేస్తున్నారు.

అయితే గ్రామస్థులు రామాంజులు, ఈశ్వరయ్య, రాముడు, మరికొందరు తాము 2022-23, 2023-24 సంబంధించి ఇంటి పన్నులు చెల్లించామని, అయితే పంచాయతీ అధికారులను సంప్రదించగా, రసీదు చూపాలంటున్నారని, అలా చూపకుంటే మళ్లీ పన్నులు చెల్లించాల్సిందేనని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తేదీ లేకుండా ఇచ్చిన రసీదు

తేదీ లేకుండా రసీదు

పంచాయతీ సిబ్బంది ఇచ్చే రసీదులో తేదీ ఉండకపోవడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. గతంలో కూడా పంచాయతీ సిబ్బంది రూ.5 లక్షల వరకు ఇంటి పన్నులను వసూలు చేసి పంచాయతీకి చెల్లించలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేయించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రసీదు తీసుకురావాలి



ఇంటి, నీటి పన్నులు కట్టేవారు తప్పకుండా రసీదు తీసుని వాటిని తమవద్దే ఉంచుకోవాలి. రసీదు చూపకుంటే మేమేమీ చేయలేం. ముగ్గురు ప్రైవేటు వ్యక్తులచే పన్నులు వసూలు చేస్తున్నాం, వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నాం. అవినీతికి తావివ్వకుండా చూస్తున్నాం. - శివకుమార్, కార్యదర్శి

మహాసభలు జయప్రదం చేయండి

వెల్దుర్తి టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మే 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవరాం సీపీఐ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. అధికారులోకి వస్తే ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోదీ హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. బ్రహ్మం, సహాయ కార్యదర్శి ఎల్లశేఖర్, నాయకులు రాముడు, వీరేష్ పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రమణరావు



దేవనకొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా బీవీ రమణరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు డ్వామా కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై దేవనకొండ ఎంపీడీవోగా వచ్చారు. గతంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణ పదోన్నతిపై అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. ఎంపీడీవోను కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు.

ఆలూరు ఎంపీడీవోగా మద్దిలేటిస్వామి



ఆలూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా మద్దిలేటిస్వామి నియామకమయ్యారు. మద్దికెరలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ పదోన్నతిపై ఆలూరు ఎంపీడీఓగా నియామకమయ్యారు. గురువారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

ఆర్‌డీటీ సేవలను కొనసాగించాలి


రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న ఆర్‌డీటీ సేవలను యథావిధిగా కొనసాగించాలని సీపీఐ కార్యదర్శి రాజాసాహెబ్, డీహెచ్‌పీఎస్ నాయకుడు గురుదాస్, చేతివృత్తుల దారుల సంఘం జిల్లా కార్యదర్శి కారన్న, రైతు సంఘం కార్యదర్శి సిద్దు డిమాండ్ చేశారు. బుధవారం ఆర్డీవో ఆఫీసు ఏవో సుదర్శన్‌కు వినతి పత్రం సమర్పించారు. తెలుగు రాష్ట్రాల్లో ఆర్‌డీటీ స్వచ్ఛంద సంస్థ అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ పేదల అభ్యున్నతికి అహర్నిశలూ కృషి చేస్తుందన్నారు. ఐదున్నర దశాబ్దాలుగా సేవలందిస్తున్న సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ ఇవ్వకపోడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని కోరారు.

పండ్ల తోటల పెంపకంపై దృష్టి పెట్టండి

తుగ్గలి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకంపై దృష్టి పెట్టాలని ఏపీవో హేమసుందర్ అన్నారు. బుధవారం మాట్లాడుతూ వేసవిలో కూలీలకు ఉపాధి హామీ పనులను కల్పించాలని, అలా చేయకపోతే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండ్ల తోటల పెంపకంతో రైతులకు వంద శాతం రాయితీ అందుతుందని, వారికి అవగాహన కల్పించాలని సూచించారు. టీఏలు రాజశేఖర్, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ముఖద్వారంతో ఆధ్యాత్మిక శోభ


పూజలు చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆలయ ముఖద్వారం ఏర్పాటుతో గ్రామాలకు ఆధ్యాత్మిక శోభ వస్తుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని మణెకుర్తి గ్రామంలో దేవమ్మ ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభించారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర్లు, దేవేంద్ర, వన్నూరువలి, రమేష్ పాల్గొన్నారు.

యువతలో మార్పు కోసమే సైకిల్ యాత్ర


అవగాహన కల్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): యువతలో మార్పు తెచ్చేందుకే సైకిల్ యాత్ర చేస్తున్నట్లు డీవైఎఫ్ఐ నాయకులు తెలిపారు. యాత్ర బుధవారం రెండోరోజు పట్టణంలో సాగింది. పట్టణ అధ్యక్షుడు వీరేష్ మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణం కోసం నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కొత్త బస్టాండు, మండిగిరి, తిమ్మారెడ్డి బస్టాండు, ఏస్కేడీ కాలనీ, క్రాంతినగర్ ప్రాంతాల్లో యాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, వెంకటేష్, మోహన్, నవీన్, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ షర్మిల గృహ నిర్బంధం అన్యాయం

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను గృహ నిర్బంధం చేయడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతి నాయుడు అన్నారు. బుధవారం మాట్లాడుతూ మహిళా నాయకురాలిని నేరస్థురాలిగా నిర్బంధించడం ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగించే చర్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వలాభం కోసం ఇలా ప్రవర్తించడం సమంజసం కాదన్నారు.

విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మికత అవసరం


క్రైస్తవ గీతాలను ఆలపిస్తున్న వీబీఎస్ ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మికత అలవర్చుకోవడం అవసరమని సియోను ప్రార్థన మందిరం దైవ సేవకుడు సహోదరుడు అగిపోగు తిమోతి పేర్కొన్నారు. చర్చిలో విరామ బైబిల్ పాఠశాల (వీబీఎస్) వేసవి తరగతులు నిర్వహిస్తున్నారు. దైవ సేవకుడు క్రీస్తుయేసు మంచిసైనికుడు అంశంపై చిన్నారులకు కథలు, పాటలు బోధించారు. చిన్నప్పుడే దైవక్రమంలో ఉంటే పెద్ద వారైనప్పుడు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉంటారని తెలిపారు. హైదరాబాదు హెబ్రోను నుంచి వచ్చిన సహోదరీలు క్రైస్తవ కథలు వినిపించారు. సాయంత్రం పప్పెట్ షో ద్వారా అలరించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు రమేష్, సామేల్, జాషువా, రాజ్ కుమార్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్యను పెంచాలి

హాలహర్వి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో వరలక్ష్మి సూచించారు. బుధవారం కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి కుటుంబానికి పూర్తి స్థాయిలో పని కల్పించాలని, కూలీలతో పాటు కార్మికులకు కేంద్ర ప్రభుత్వం కల్పించిన ప్రధానమంత్రి ప్రమాద బీమా నమోదు చేయించాలన్నారు. తోటల పెంపకానికి రైతులను ఎంపిక చేయాలని కోరారు. ఏపీఓ చక్రవర్తి, ఈసీ దాసు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సభ్యుల సహకారంతో సేవలు

ఆదోని టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అవోపా సంస్థ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని సంస్థ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా పేర్కొన్నారు. మంగళవారం రాజశ్రీ కాంప్లెక్స్‌లో రెండోసారి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనను మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కోశాధికారి యాదగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, అధ్యక్షుడు శ్రీనాథ్ గుప్తా సేవలకు గుర్తింపుగా ఎన్టీఆర్ జాతీయ అవార్డు, భారత సేవా రత్న, బంగారు నంది అవార్డులు లభించడం తమ సంస్థకే గర్వకారణమన్నారు. ఎన్ఐఆర్ కాకుబాల్ నగేష్, రత్నయ్య, రఘు, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


ట్రోఫీ అందజేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

హాలహర్వి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): యువకులు క్రీడల్లో రాణించాలని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ సూచించారు. బుధవారం నిట్రవట్టి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమ పథకాలతోపాటు క్రీడాభివృద్ధికి సైతం కృషి చేస్తున్నారన్నారు. తిప్పేస్వామి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

తుగ్గలి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు హరిత సూచించారు. మండలంలోని పగిడిరాయిలో బుధవారం గర్భిణులు, బాలింతలు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు చికిత్స చేశారు. వాతావరణ మార్పులతో వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకోవాలని కోరారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు టీకాలు వేయించాలని కోరారు.

కార్యకర్తలకు బీజేపీలో గుర్తింపు

ఆదోని టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో సాధారణ సాధారణ కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని పార్టీ అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజు గౌడ్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ రాజ్యసభ సీటును క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాక సత్యనారాయణ గౌడ్‌కు కేటాయించడంతో కూటమి పార్టీల మధ్య సహకారం స్పష్టమైందన్నారు.

ఉపాధి కూలీని ఆదుకోవాలి

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనికి వెళ్లి పాము కాటుకు గురైన దూదేకొండ గ్రామ నివాసి పింజారి ఖాసింను ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ క సంఘం జిల్లా కార్యదర్శి నబీ రసూల్, దూదేకొండ గ్రామ సీపీఐ ఎంపీటీసీ పెద్ద వీరన్నలు డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏపీవోకు వినతి పత్రం సమర్పించార

రేపటి నుంచి అవగాహన సదస్సులు

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికలకు మే 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పత్తికొండ సీడీపీవో లలిత అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కిషోర బాలికల ఆరోగ్యం, విద్య, బాల్య వివాహాలు, శిక్షణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేస్తామన్నారు.

ప్రశాంతంగా పాలీసెట్

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు నిర్వహించే పాలీసెట్ బుధవారం ప్రశాంతంగా జరిగిందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. పట్టణంలో 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 2,771 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 332 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

బాధ్యతగా పని చేశా

క్రిష్ణగిరి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిబంధనల మేరకు బాధ్యతతో పనిచేసినట్లు తహసీల్దార్ దేవ చంద్రశేఖర్ అన్నారు. బుధవారంయి తహసీల్దార్ పదవీ విరమణ పొందడంతో రెవెన్యు సిబ్బంది వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సహకరించిన వారందరికీ తహసీల్దార్ కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

పత్తికొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలో హోసూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కె పకీరప్ప(60) కర్నూలులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. టీడీపీ వర్గీయుడిగా ఉంటూ 2009-14లో సర్పంచ్‌గా పనిచేశారు. ఇదివరకే గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న ఆయన నెల క్రితం కర్నూలు ఆసుపత్రిలో చేరాడు. టీడీపీ నాయకుడు సాంబ శివారెడ్డి, చందోలి తిరుపాల్, లోకనాథ్, హరినాథ్‌గౌడు, గ్రామ నాయకులు అంజి, అశోక్, సాయి నివాళి అర్పించారు.

పేకాటరాయుళ్లపై కేసు

ఆదోని రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తానాపురం గ్రామ సమీపంలో పేకాట శిబిరంపై ఇస్పీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ నాయక్ తెలిపిన మేరకు.. బుధవారం సిబ్బందితో కలిసి దాడులుచేసి, 15 మందిని అదుపులోకి తీసుకొని, రూ.6,840లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు

ఆదోని రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కల్లుబావికి చెందిన గొల్ల వీరేష్‌కు ఆదోని కోర్టు నెల జైలుశిక్ష విధించింది. ఎస్ఐ తెలిపన మేరకు.. ఈనెల 22వ తేదీన మద్యం తాగి ఆటో నడుపుతూ పెద్దతుంబళం పోలీసులకు పట్టుపడ్డాడు. కేసు నమోదు చేసి ధర్యాప్తు చేసిన ఎస్ఐ మహేష్ కుమార్ కోర్టుకు అప్పజెప్పారు. నేరం రుజువు కావడంతో ఆదోని సెకండ్ అడిషనల్ సివిల్ న్యాయాధికారి శ్రీవల్లి నింధితుడికి నెల జైలుశిక్ష విధించినట్లు ఎస్.ఐ తెలిపారు.

ఉదయమే పనులకు రండి : ఏపీవో

ఆలూరు, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో కూలలు ఉదయమే పనులకు రావాలని ఏపీవో శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండలంలోని మొలగవల్లి గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూలీలకు వివరించారు.

ఆదోనికి నూతన మాస్టర్ ప్లాన్ మంజూరు


మాస్టర్‌ప్లాన్‌ను ప్రదర్శిస్తున్న కమిషనర్ కృష్ణ

ఆదోని టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ; పట్టణాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఆదోనికి నూతన మాస్టర్ ప్లాన్‌ను మంజూరు చేస్తూ, ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణ తన చాంబర్‌లో నూతన మాస్టర్ ప్లాన్‌ను ప్రదర్శించారు. 20 ఏళ్లపాటు అమలులో ఉండేలా కొత్త మాస్టర్ ప్లాన్ మంజూరు చేశారని, గృహ నిర్మాణదారులు ఇకపై ఈ మాస్టర్ ప్లాన్‌ను అనుసరించి ఇళ్లు నిర్మించుకోవలసి ఉంటుందని తెలిపారు. టీపీవో బాల మద్దయ్య సచివాలయం వార్డు ప్లానింగ్ సెక్రటరీ రాఘవ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి


నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతి టాలెంట్ హై స్కూల్ ఆవరణలో బుధవారం అభ్యుదయ కవి శ్రీశ్రీ జయంతి నిర్వహించారు. అరసం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ శ్రీశ్రీ చిత్రపటానికి నివాళి అర్పించారు. సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీశ్రీ అడుగు జాడల్లో కవులు, కళాకారులు పయనించాలని కోరారు. హెచ్ఎం విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, చాంద్‌బాషా, హమీద్, రహంతుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న జ్ఞానేశ్వర్ గౌడ్

వెల్దుర్తి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి సమీపాన బ్రహ్మగుండేశ్వర రోడ్డులో జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల భవనానికి స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగసూరి ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్ బుధవారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో పాఠశాలను నిర్మించనున్నట్లు తెలిపారు. సర్వే నెం.1221లో 11 ఎకరాలను పాఠశాలకు కేటాయించారని, రూ.15 లక్షల సమగ్ర శిక్ష అభియాన్ నిధులతో మొదట ఒక భవనాన్ని నిర్మించి, మిగతా పనులకు త్వరలో టెండర్లు పిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగస్వామి, హరి, అబ్దుల్లా, పాపారాయుడు పాల్గొన్నారు.

పత్తికొండలో చోరీ

● కమ్మలు, వెండి వస్తువుల అపహరణ

పత్తికొండ, ఏప్రిల్ 30(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని గుత్తి సర్కిల్ ప్రాంతంలో చోరీ జరిగింది. వివరాల మేరకు.. అక్బర్‌వలి అనే వ్యక్తి అదే ప్రాంతంలో బంగారు దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. తాళం వేసిన ఇంటిని గమనించిన దొంగలు పైకప్పు నుంచి ఇంట్లోకి ప్రవేశించి 3 జతల కమ్మలు, 500గ్రాముల వెండి వస్తువులు చోరీ చేశారు. ఉదయం ఇంటికి వచ్చిన అక్బర్, కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

ఆరోగ్య భద్రతను కాపాడాలి

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రజల ఆరోగ్యభద్రతను కాపాడాలని ఈగల్ సెల్ ఎస్ఐ సృజన్ కుమార్, పత్తికొండ సీఐ జయన్న, మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష ఉపాధ్యక్షులు నాగరాజు, నీలకంఠ కోరారు. బుధవారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో పత్తికొండ సబ్ డివిజన్ పరిధిలోని మెడికల్ షాపుల యజమానులకు డ్రగ్స్ విత్ అవుట్ ప్రిస్కిప్షన్‌పై అవగాహన కల్పించారు. ఎన్ఆర్ఎస్ ఉల్లంఘనతో రోగుల ఆనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. మెడికల్ షాపుల యజమాన్యాలు నిబంధనలు పాటించాలని, డాక్టర్ పేరు, ఎంసీఐ నెంబర్ ప్రిస్కిప్షన్‌పై తప్పనిసరిగా ఉండాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా బసవ జయంతి


వేడుకల్లో పాల్గొన్న డీహెచ్‌పీఎస్ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వీరశైవ ధర్మాన్ని స్థాపించిన బసవేశ్వరుడి జయంతిని బుధవారం నిర్వహించారు. పట్టణంలోని బైపాస్ రోడ్డు వద్ద బసవేశ్వరుడి విగ్రహానికి దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి వీరేష్ నివాళి అర్పించారు. కుల మతాలను వ్యతిరేకించి మనుషులంతా సమానమేనని చాటిన సంఘ సంస్కర్త బసవేశ్వరుడు అన్నారు. విజయ్, పీటర్, రామకృష్ణ, రవి, పులి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని టౌన్: బసవేశ్వరసర్కిల్ వద్ద బసవేశ్వర స్వామి విగ్రహానికి బీజేపీ నాయలు నివాళి అర్పించారు. విట్టా రమేష్, మలేకార్ శ్రీనివాసాచారి, నాగరాజు గౌడ్, వాల్మీకి సాయి, మరియాని చెన్నబసప్ప, రమేషాచారి, ఆదూరి విజయకృష్ణ, రమాకాంత్ పాల్గొన్నారు.

ఆలూరు: పట్టణంలో 892వ బసవ జయంతి బుధవారం రాత్రి నిర్వహించారు. ఎడ్లబండిపై బసవేశ్వర చిత్రపటాన్ని ఊరేగించారు. భీమలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు మల్లికార్జునస్వామి, ఎర్రిస్వామి రుద్రాభిషేకం, కుంకుమార్చన, బిల్వ అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిలేహాల్ మల్లికార్జునస్వామి, గౌసిద్ధయ్యస్వామి, శివరుద్రయ్యస్వామి, యుగంధర్‌స్వామి, విశ్వేశ్వరయ్యస్వామి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హాలహర్వి: వీరశైవ మతస్థాపకుడు బసవేశ్వర జయంతి బుధవారం నిర్వహించారు. చిత్రపటనికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు.

మద్దికెర: మండల కేంద్రంలోని బసవన్న ఆలయంలో బసవజయంతి వేడుకలు నిర్వహించారు. బుధవారం మూలవిరాట్ బసవన్నను అలంకరించి, ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకీ మహోత్సవం, రాత్రి భజన నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి, వై.శాంతన్న, నిర్వాహకులు సూర్యప్రకాష్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

వేతనంలో కోత పెడితే సహించం

● ఎంపీడీవో పుల్లయ్య



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

నందవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు ఉపాధి కూలీల వేతనంలో కోత పెడితే సహించేది లేదని ఎంపీడీవో పుల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని పూలచింత గ్రామంలో ఫీడర్ చానల్ ఉపాధి పనుల మస్టర్ల ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉపాధి కూలీ ప్రధానమంత్రి జీవనజ్యోతి సురక్షయోజన బీమా తప్పని సరిగా చేయించుకో వాలన్నారు. కొలతల ప్రకారం పని చేసి రూ 307 పడేలా రోజు వేతనం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు..

రవికులకర్ణి సేవలు అభినందనీయం



సూపరింటెండెంట్ రవికులకర్ణిని సన్మానిస్తున్న శ్రీమఠం ఉద్యోగులు

మంత్రాలయం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంలో సూపరింటెండెంట్‌గా వివిధ హోదాల్లో సేవలందించిన రవికులకర్ణి సేవలు అభినందనీయమని మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేశ్‌జోషి, సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మధ్వమార్గ్ కారిడార్‌లో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో సూపరింటెండెంట్‌గా పనిచేసి పదవీవిరమణ పొందిన రవికులకర్ణికి శ్రీమఠం ఎంప్లాయీస్ అసోసియేషన్, ఉద్యోగులు రాఘవేంద్రస్వామి జ్ఞాపిక, శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, అనంతపురాణిక్, జేపీ స్వామి, బీఎం ఆనందరావు, గిరిధర్, వాదిరాజాచార్, వాదేంద్రాచార్, ద్వారపాలక అనంత స్వామి, విజేంద్రాచార్, సుజ్ఞానేంద్రాచార్, మఠం సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు



రికార్డులను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్

గోనెగండ్ల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): భూములను రీ సర్వే చేసే సమయంలో ఒకరికి తక్కువ, మరొకరికి ఎక్కువ భూమి వచ్చిందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అన్నింటిని సరిచేస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. బుధవారం గోనెగండ్లలో జరుగుతున్న భూ రీసర్వే పనులను ఆయన పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. విధులకు ఆలస్యంగా వచ్చిన ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములను సర్వే సమయంలో కొంత ఎక్కువ తక్కువ వచ్చినట్లు తమ దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామి, సర్వేయర్ శ్రీనివాసరాజు, రీ సర్వే ఉప తహసీల్దార్ శిరీషా, పలు గ్రామాల వీఆర్‌వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు మంజూరు చేయాలి: పెద్దమరివీడు గ్రామంలో పేదలందరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ కర్నూలు జిల్లా చైర్మన్ అంజనయ్య డిమాండ్ చేశారు. కొన్ని రోజుల క్రితం విజయవాడంలోని గ్రీవెన్ సెల్‌లో సీఎంకు వినతి పత్రం అందజేశామన్నారు. ఇందుకు స్పందించిన జిల్లా అధికారులు గ్రామంలో పేదలను సర్వే చేసి ఇళ్లు నిర్మించి ఇస్తామని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ హామీ ఇచ్చారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోండి

కౌతాళం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలకు అర్హులందరు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో నివసిస్తూ ఇంటి స్థలంలేని పేదలు తమ పేరు, చిరునామాతో కూడిన దరఖాస్తును సమీపంలోని సచివాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తామని తెలిపారు. ఇంటి స్థలాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు.

మద్యం పట్టివేత.. కేసు నమోదు

గోనెగండ్ల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్ననేలటూరు గ్రామంలో ఈడిగ నరసింహులు అనే వ్యక్తి మద్యం విక్రయిస్తుండటంతో అరెస్టు చేసినట్లు సీఐ విజయభాస్కర్ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో నరసింహులు కొంత కాలంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారు. సమాచారం మేరకు పోలీసులు నరసింహులు ఇంట్లో సోదా చేయగా 39మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. దాంతో వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నెరవేరిన కల..

● ప్రభుత్వాస్పత్రికి ఎకరా స్థలం కేటాయింపు
● ప్రభుత్వానికి నివేదిక పంపిన పీఠాధిపతి
● హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

మంత్రాలయం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం ప్రజల కల ఎట్టకేలకు నెరవేరనుంది. మంత్రాలయంలో ప్రభుత్వాస్పత్రి లేక ప్రజలు ఇబ్బందులు పడేవారు. వారి ఎన్నో ఏళ్ల కలను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నెరవేర్చేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య విధాన ఆసుపత్రి నిర్వాహకులు మంత్రాలయంలో కనీసం 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు శ్రీమఠం భూమి కేటాయించాలని లేఖ రాసింది. దీంతో పీఠాధిపతి మంత్రాలయం ప్రజలు, గ్రామాలను దృష్టిలో ఉంచుకుని మానవత్వంతో స్పందించి ఎకరా స్థలాన్ని ఆసుపత్రికి కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం పీఠాధిపతి ఆదేశాల మేరకు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషి, సురేష్ కోనాపూర్లు అధికారికంగా అతి తక్కువ మొత్తంలో రూ.కోట్లు విలువ చేసే ఎకర స్థలాన్ని లీజుకు ఇచ్చేందుకే అంగీకార పత్రం ఖరారు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం చెందిన సర్వే నెంబరు 160లోని ఒక ఎకరా ఎంపీడీవో కార్యాలయం, బీసీ హాస్టల్ పక్కన ఉన్న ఎకరా స్థలాన్ని లీజుకు ఇచ్చేందుకు అంగీకార పత్రాన్ని ప్రభుత్వానికి పంపారు.



మంత్రాలయంలో ప్రభుత్వ ఆసుపత్రికి కేటాయించిన స్థలం

ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే టెండర్లు నిర్వహించి నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ ఆసుపత్రి నిర్మాణానికి ఎకరా స్థలం పీఠాధిపతి ఇవ్వడంతో మంత్రాలయం ప్రజలతో పాటు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా అక్షయ తృతీయ వేడుకలు

శ్రీమఠం చుట్టూ గంధం ఊరేగింపు

మంత్రాలయం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి సన్నిధానంలో అక్షయతృతీయ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో బంగారు ఆండాల్లో సిద్ధపరిచిన గంధాన్ని శ్రీమఠం చుట్టూ వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. పీఠాధిపతి రాఘవేంద్రస్వామికి, వాదేంద్రతీర్థులకు, ఆంజనేయ స్వామికి, మంచాలమ్మకు, పూర్వపు పీఠాధిపతి బృందావనాలకు గంధ లేపన మహోత్సవం చేశారు. బృందావనాలకు గంధం అలంకరించి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మహా మంగళహారతులు ఇచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు గంధలేపన మహోత్సవంలో పాల్గొని తరించారు. పీఠాధిపతి భక్తులకు శేషవస్త్రం, ఫల పుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో పండిత కేసరి విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, అప్రమేయాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషి, సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, ఇన్స్‌పెక్టర్లు వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్లు అనంతపురాణిక్, రవికులకర్ణి, విజయేంద్రాచార్, ద్వారపాలక అనంత స్వామి, బద్రినాథ్, వాదేంద్రాచార్ పాల్గొన్నారు.



బంగారు బిందెల్లో గంధాన్ని ఊరేగింపుగా తెస్తున్న పీఠాధిపతి, పండితులు

న్యాయసుధ విద్యకు వేదపాఠశాల విద్యార్థులు

● తొమ్మిదో విడతలో ఏడుగురికి అవకాశం



వేద విద్యార్థులకు గ్రంథాలను అందజేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురు సార్వభౌమ సంస్కృత వేదపాఠశాలలో చదువుతున్న ఏడు మంది విద్యార్థులను శ్రీమన్ న్యాయసుధ విద్యకు ఎంపిక చేశారు. బుధవారం రాఘవేంద్ర స్వామి మూల బృందావనం, పీఠాధిపతుల 9వ బ్యాచ్ ఏడు మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా శ్రీమన్ న్యాయసుధ పరిమళ గ్రంథాన్ని పూర్తి చేయడం కఠినతరమైనప్పటికీ విద్యార్థులు కేశవ, విష్ణుతీర్థ, జయసింహ, రాఘవేంద్ర, బి.రాఘవేంద్ర, పాండురంగ, రాజా ఎస్ అప్రమేయాచార్‌లకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్‌లను గ్రంథాలు అందజేసి శ్రీమన్ న్యాయసుధ పాఠాన్ని ప్రారంభించారు. ఎన్నికైన విద్యార్థులకు మఠం అధికారులు సంస్కృత పాఠశాల ప్రిన్సిపాల్ రమణారావు,రిటైర్డు ప్రిన్సిపాల్ వాదిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, సురేష్ కోనాపూర్, వెంకటేశ్ జోషి, ఐపీ నరసింహమూర్తి అభినందించారు.

భూతగాదాలో ఘర్షణ : కేసు నమోదు

నందవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముగతి గ్రామంలో బుధవారం భూ తగాదాతో ఘర్షణ చోటు చేసుకుంది. ఎస్ఐ కేశవ్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఎర్రిస్వామి తనకు కోర్టు ఆదేశాలు ఇచ్చిందని పొలంలో ట్రాక్టర్‌తో పనులు చేస్తుండగా బోయ నాగరాజు, తండ్రి దస్తగిరి పనులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దాంతో మాట మాట పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. ఎర్రిస్వామి తలకు గాయాలైయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రాలయంలో భక్తుల సందడి



మఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు

మంత్రాలయం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది. బుధవారం అక్షయ తృతీయ కావటంతో దక్షణాది రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని భక్తులు పీఠాధిపతుల ఆశీస్సులు పొందారు.

కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటం

గోనెగండ్ల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ అన్నారు. బుధవారం గోనెగండ్లలో సీఐటీయూ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం కోసం ప్రాణాలను అర్పించి హక్కులను సాధించిన సంఘం సీఐటీయూ అని అన్నారు. మే డే రోజు కార్మికులు అందరూ జెండా ఆవిష్కరణలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కరుణాకర్, నబిరసూల్, వేణు, రాఘవ, రఫీ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

గోనెగండ్ల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్ కైరవాడిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక మహిళలు కోరారు. బుధవారం ఆదోని డీఎల్‌పీవో నూర్జహాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కొంత కాలంగా గ్రామంలోని తాగునీటి సమస్య నెలకొందన్నారు. ఇందుకు స్పందించిన డీఎల్‌పీవో గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు పాల్గొన్నారు.

మంత్రాలయంలో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి


మంత్రాలయం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్ప, కుమారుడు శివమొగ్గ ఎంపీ రాఘవేంద్రలు కుటుంబ సమేతంగా బుధవారం రాత్రి మంత్రాలయానికి వచ్చారు. పద్మనాభతీర్థ గెస్ట్‌హౌస్ వద్ద వీరికి మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు సురేష్ కోణాపూర్, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ స్వాగతం పలికారు. బుధవారం రాత్రి మంత్రాలయంలోనే బసచేసి గురువారం గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేస్తారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదిస్తారు.

మే డేను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మే డేను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. బుధవారం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం కార్మికులను, రైతాంగాన్ని కార్పొరేట్లకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను, అగ్రిమార్కెట్ చట్టాలను తీసుకొస్తుందన్నారు. వాటిని వ్యతిరేకిస్తూ తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి పోరాడేందుకు కార్మికులు సిద్ధం కావాలన్నారు. నేడు పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఎర్రజెండాలను ఎగురవేస్తామన్నారు. నాయకులు రాజు, ఏసేపు, ప్రతాప్, నల్లన్న, పకీర్ సాబ్, కిరణ్ పాల్గొన్నారు.

మే డే స్ఫూర్తిని చిత్రించిన ఉపాధ్యాయుడు

ప్రపంచ కార్మికదినోత్సవాన్ని పురస్కరించుకొని నందవరం మండలం కనకవీడు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశప్ప శ్రమజీవుల చిత్రాలతో ఒక చార్టుపై మే డే పోస్టర్‌ను చిత్రీకరించారు. పోస్టర్‌లో కార్మికులు, కర్షకులతో పాటు వివిధ వృత్తులు చేస్తూ జీవనం సాగిస్తున్న వారు చేస్తున్న పనులను చూపుతూ చిత్రీకరించారు. పలువురు ఉపాధ్యాయుడిని అభినందించారు.



శ్రమజీవుల చిత్రాలతో మే డే చిత్రాన్ని గీసిన ఉపాధ్యాయుడు

ఘనంగా బసవ జయంతి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): విశ్వగురువు బసవేశ్వరుని జయంతిని ఎమ్మిగనూరు పట్టణంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని షరాఫ్ బజార్‌లో వెలసిన ఎదురు బసవన్న గుడి, తేరుబజారులో వెలసిన బసవేశ్వరాలయాల్లో పూజారులు స్వామి వారికి అభిషేకం, ఆకుపూజతో పాటు పలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వీరశైవులు తరలిరావటంతో ఆలయాలు కిటకిటలాడాయి. సాయంత్రం బసవేశ్వరుని చిత్రపటాన్ని ఎద్దులబండిపై మేళతాళాలతో ఊరేగించారు. తేరుబజారులోని బసవేశ్వర ఆలయంలో మాజీ ఎంపీ, వైసీపీ ఇన్‌చార్జి బుట్టా రేణుక, ఆమె భర్త నీలకంఠలు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. అంతేగాక పలువురు రైతులు బసవజయంతిని పురష్కరించుకొని తమ వృషభాలను అలంకరించి ఊరేగించారు. కార్యక్రమంలో పట్టణ వీరశైవలింగాయత్ సంక్షేమసంఘం అధ్యక్షకార్యదర్శులు రాచోటప్ప, మామిడి మల్లికార్జున, గౌడ్, భద్రి, మంజునాథ్, హరి, కుమార్, బసవరాజు, కౌన్సిలర్ నాగేశప్పలు పాల్గొన్నారు.

కోసిగి: మండల కేంద్రంలో వీరశైవ సేవా సంఘం ఆధ్వర్యంలో బసవ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రేణుకా ఎల్లమ్మ దేవాలయం నుంచి ప్రధాన రోడ్డు గుండా కోసిగియ్య గుడి వరకు వీరశైవ సేవా సంఘం నాయకులు, కులబాంధవులు పెద్ద ఎత్తున బసవేశ్వరస్వామి చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో వీర శైవ సేవా సంఘం కుల బాంధవులు ఉన్నారు.

మంత్రాలయం: మంత్రాలయంలో జంగమ మహేశ్వరులు, వీరశైవ లింగాయతుల ఆధ్వర్యంలో బసవ జయంతి వేడుకలు బుధవారం వైభవంగా జరుపుకున్నారు. బసవేశ్వరస్వామి చిత్రపటాన్ని ఎద్దులబండిపై ఉంచి కోలాటాలు, నందికోళ్ల నృత్యాలు, మహిళలు, చిన్నారుల మహామంగళహారతుల మధ్య ఘనంగా ఊరేగించారు. రామలింగేశ్వర స్వామి ఆలయం నుంచి రాఘవేంద్ర సర్కిల్ వరకు అక్కడి నుంచి దేవాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు మూలింటి చంద్రశేఖర్‌గౌడు, ఆడిటర్ శంకర్ స్వామి, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, కోటేశ్వరస్వామి, పరమేష్ గౌడు, మల్లికార్జునగౌడు, వీరేష్, లింగస్వామి, బసవరాజు గౌడు, రమేష్ గౌడు, మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ ఉన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రంలో బుధవారం బసవ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్య స్వామి ఆధ్వర్యంలో వీరశైవులు వీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బసవవేశ్వరస్వామి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరశైవులు, సురేష్ దంపతులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో బసవేశ్వరుని చిత్రపటాన్ని ఊరేగిస్తున్న వీరశైవ లింగాయత్‌లు



కోసిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న వీరశైవ సేవా సంఘం సభ్యులు



గోనెగండ్లలో పూజలు నిర్వహిస్తున్న వీరశైవులు

ఓటీటీలో ఇన్‌ఫార్మర్ చిత్రం విడుదల

పాల్గొన్న దర్శక నిర్మాతలు, నటులు



కార్యక్రమానికి హాజరైన దర్శక, నటీనటులు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన అగ్రహారం నాగిరెడ్డి, ఉమాదేవిలు నిర్మించిన ఇన్‌ఫార్మర్ చిత్రం బుధవారం ఓటీటీలో విడుదలైంది. ఈ సందర్భంగా పట్టణంలోని మంత్రాలయం రోడ్డులో ఉన్న టెస్ట్ బౌల్ రెస్టారెంట్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఇన్‌ఫార్మర్ సినిమాలో హీరోగా ఎమ్మిగనూరుకు చెందిన వినోద్ రెడ్డి నటించారు. చిత్రం బాగా రావటంతో నిర్మాతలు, దర్శకుడు వసంత్, అతిథులు కాంతారెడ్డి, వీరారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. నటులు సాకారం రజాక్, గురు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు వైసీపీ నియోజకవర్గ సమావేశం

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నేడు పట్టణంలో వైసీపీ నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, స్థానిక ఇన్‌చార్జి మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే చెన్న కేశవరెడ్డి, సీనియర్ నాయకులు జగన్మోహన్‌రెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే తనయుడితో పాటు ఆయన వర్గీయులు సమావేశానికి రాక పోవచ్చనే చర్చ సాగుతోంది.

మదర్సాలో బాలికలకు సమ్మర్ ఇస్లామిక్ క్యాంపు

ఎమ్మిగనూరు,ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మదర్సా దారుల్ హుదా లిల్ బనాన్(బాలికలు)లో మొదటి సారి బాలికలకు 30 రోజుల పాటు సమ్మర్ ఇస్లామిక్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ శంసున్నిసా తెలిపారు. బాలికలకు సమ్మర్ రోజుల్లో ధార్మిక, నైతిక విలువలపై శిక్షణ ఇస్తామన్నారు. ఇందులో భాగంగా ఖురాన్‌లో కొన్ని సూరాల కంఠస్థం, మస్నూన్ దుఆలు, ఇస్లామియా అఖీదహ్, సీరతున్ నబి సల్లల్లాహు, అలైహివసల్లం, ఇస్లామియ నైతిక విలువలపై శిక్షణ ఉంటుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9440035247లను సంప్రదించాలని సూచించారు.

8న జాబ్ మేళా



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు,ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కోరారు. బుధవారం ఆయన స్వగృహం దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జాబ్ మేళా పోస్టర్లను ఎమ్మెల్యే అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకొస్తుందన్నారు. ఈ పరిశ్రమలు ఏర్పాటైతే వేలాది మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. ఈనెల 8న ఎమ్మిగనూరులోని జూనియర్ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాకు 13కు పైగా బహుళజాతీయ కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. అభ్యర్థులకు ఎస్సెసీ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమో, బీటెక్, ఎంబీఏ వంటి విద్యార్హతలు ఉండాలన్నారు. అలాగే 18 నుంచి 35ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత పత్రాలతో హాజరుకావలన్నారు. ఈ అవకాశాన్ని ఎమ్మిగనూరు ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఆనంద్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రసాద్, పేస్‌మెంట్ఎగ్జిక్యూటివ్ సాయితేజ్, గోనెగండ్ల నజీర్ పాల్గొన్నారు.

'అధైర్య పడకండి... అండగా ఉంటాం'

కోసిగి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు అధైర్య పడవొద్దు.. అండగా ఉంటామని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. మండలంలోని పల్లెపాడు గ్రామంలో బుధవారం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ సీనియర్ మహిళా కార్యకర్త పోతుల లక్ష్మిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను, వైద్యం గురించి ఆరా తీశారు. అండగా ఉంటామని, అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. కర్నూలు ఆసుపత్రిలో వైద్యచికిత్సలు చేయించి బాగు చేయిస్తామని ఆమెకు భరోసా ఇచ్చారు.